
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం 9 డిసెంబరు 2025
5

అభ్యర్థులు డబ్బులిచ్చినా..
బెదిరించినా.. నేరమే
జైలు శిక్షలతో పాటు జరిమానాలూ తప్పవు 7

వివాదాలకు తావివ్వొద్దు : కలెక్టర్ జితేష్



అవినీతి నిరోధక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్, పక్కన ఏసీబీ డీఎస్పీ

అవినీతి రాజ్యమేలుతోంది!



- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న లంచావతారులు
- ఐదేళ్లలో 70మందికి పైగా పట్టుబడిన వైనం
- ప్రజల్లో చైతన్యం లేకపోవడం వల్లనే..
- గత రెండేళ్లలో మరింత పెరిగిన కేసులు
- నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏదైనా పనికావాలి అంటే.. పైసలుండాల్సిందే. సార్లు ఎంతడిగితే అంత ముట్టజెప్పాల్సిందే. అలా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏ ప్రభుత్వ కార్యాలయంలో చూసినా అవినీతి రాజ్యమేలుతోంది. కిందిస్థాయి ఉద్యోగులను ఉపయోగించుకుని కొందరు, దళారుల సాయంతో మరికొందరు.. నేరుగా ఇంకొందరు ఇలా చెప్పుకుంటూ పోతే.. ఎవరికి వారు లంచాల మత్తులో జోగుతున్నారు. 'అవినీతికి కాదేదీ అనర్హం' అన్నట్టుగా ఇటీవల కొందరు ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారు. ఇలా ఐదేళ్ల కాలంలో ఉమ్మడి జిల్లాలో 70మందికి పైగా వివిధ శాఖల్లోని.. వివిధ స్థాయిల అధికారులు పట్టుబడగా.. ఈ రెండేళ్లలో ఈ అవినీతి కేసులు మరింత పెరిగాయని లెక్కలు చెబుతున్నాయి. ఇక ఈ అవినీతికి ఆజ్యం పోసింది కూడా పౌరులేనన్న వాదన కూడి ఉంది. తమ పనులను త్వరితగతిన పూర్తిచేయించుకోవాలన్న భావనలో చాలామంది లంచాలు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావడం.. రానురాను అధికారులకు అవకాశంగా మారింది. రోజురోజుకు వేళ్లూనుకుపోతున్న అవినీతిని అంతమొందించే క్రమంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. మార్పు మాత్రం కనిపించని పరిస్థితి. - ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం 6

శ్రీరామ పునర్వసు
దీక్ష విరమణ

- భద్రగిరి ప్రదక్షిణ.. వెండిరథ సేవ
- నేడు శ్రీరామపట్టాభిషేకం



భద్రగిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామపునరసు దీక్ష విరమణ కార్యక్రమాన్ని సోమవారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ముందుగా శ్రీరామదీక్షితులు పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి తమ ఆరాధ్య దైవమైన శ్రీసీతారామచంద్రస్వామి సన్నిధికి చేరుకొని నిత్యకల్యాణ మండప వేదిక వద్ద అర్చక స్వాములచే విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తరం నిర్వహించి తిరువడి (ఇరుముడి)ధారణ గావించారు. అనంతరం భద్రాద్రి దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు శ్రీరామపాదుకలను శిరస్సుపై ధరించి భద్రగిరి ప్రదక్షిణ నిర్వహించారు. చివరగా స్వామివారి సన్నిధిలో తిరువడిని శ్రీరామదీక్షితులు సమర్పించారు. అనంతరం స్థానిక యాగశాల వద్ద నిర్వహించిన సంక్షేప రామాయణ హవనంలో శ్రీరామదీక్షితులు పాల్గొన్నారు. రాత్రి శ్రీరామదీక్షితుల కోసం రామయ్యకు వెండిరథ సేవ నిర్వహించారు. అలాగే మంగళవారం స్వామివారికి శ్రీరామ మహా పట్టాభిషేకం నిర్వహించనున్నారు. వీరికోసం దేవస్థానం అధికారులు ఉచిత అన్నదానం ఏర్పాట్లు చేపడుతున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు దంపతులు, ఏఈవో శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ముఖ్య అర్చకులు శ్రీపెరంబుదూర్ మదన్‌మోహనాచార్యులు, కంచర్ల శ్రీనివాసరావు, వైదిక పరిపాలన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ.. పరీక్ష!

- ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పార్టీలు
- ఇల్లిల్లూ తిరుగుతున్న అభ్యర్థులు, నాయకులు
- నేటితో 'తొలివిడత' ప్రచారం పూర్తి
- మూడో విడతకు నేడు తుదిజాబితా



ఖమ్మం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): గ్రామపంచాయతీ ఎన్నికల ఘట్టంలో 'తొలి'అంకానికి సమయం సమీపిస్తోంది. మొదటివిడతలో భాగంగా 11న జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 172 పంచాయతీలు, 1,582వార్డులకు ఎన్నికలు జరగనుంన్నాయి. ఈ క్రమంలో ఆయా పంచాయతీల పరిధిలో ప్రచార ఘట్టానికి మంగళవారం సాయంత్రం 5గంటలకు తెరపడనుంది. దాంతో పార్టీలకు ఈ పంచాయతీ ఎన్నికలు పెద్ద పరీక్షగా మారాయి. నాయకులు తమ అభ్యర్థుల గెలుపు కోసం గ్రామాల్లో మకాం వేసి ఇల్లిల్లూ తిరుగుతున్నారు. తొలివిడతలో ఎర్రుపాలెం, బోనకల్, మధిరరూరల్, చింతకాని, కొణిజర్ల, వైరా, రఘునాథపాలెం మండలాల్లో ఎన్నికలు జరగనుండగా.. మొత్తం 192పంచాయతీలకుగాను 20 పంచాయతీలు ఏకగ్రీవమవడంతో మిగిలినపంచాయతీకు ఎన్నికలు జరుగుతున్నాయి. 1,740వార్డులకుగాను 158వార్డులు ఏకగ్రీవం కావడంతో 1,582వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రచార ఘట్టం ముగియబోతున్నందున ఇక రాజకీయ పార్టీలు, అభ్యర్థులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఓటర్లను ఆకర్షించే పనిలో ఉన్నారు. పోలింగ్‌కు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న తమ ఓటర్లను గ్రామాలకు రప్పించడం, వారికి అవసరమైన హామీలు నెరవేర్చడంతో పాటు మద్యం, మాంసం, డబ్బు, బహుమతుల పంపిణీపై అందరూ దృష్టిపెట్టారు. ముఖ్యంగా జనరల్ పంచాయతీల్లో డబ్బు భారీగా ఖర్చు కాబోతోంది.

ప్రచారంలో ముఖ్యనేతల కుటుంబీకులు..

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నియోజకవర్గంలో ఒక మండలంలోని పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అలాగే వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నియోజకవర్గంలో కూడా రెండు మండలాలున్నాయి. ఎన్నికల ప్రారంభ తరుణంలో నియోజకవర్గ స్థాయిలో భట్టి, తుమ్మల కార్యకర్తలు,నాయకులతో సమావేశమయ్యారు. ఆతర్వాత ఎన్నికల ప్రచారంలో మండల, జిల్లా నాయకులే పర్యవేక్షిస్తున్నారు. మధిరలో భట్టి విక్రమార్క సతీమణి మల్లునందిని, రఘునాథపాలెంలో మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు ప్రచారంలో పాల్గొంటున్నారు. బీఆర్ఎస్ నుంచి మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జడ్పీ మాజీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఎన్నికల ప్రచారం ఇప్పటి వరకు సాగించారు. ఓటర్లను తమవైపునకు తిప్పుకొనేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై కూడా కేడర్‌కు దశ, దిశా నిర్దేశం చేస్తున్నారు. పోలింగ్ బూత్‌కు ఓటర్లను తీసుకెళ్లేందుకు గ్రామాల్లో ఇన్‌చార్జ్‌లను వార్డుల వారీగా నియమించారు. సీపీఎం, సీపీఐ నాయకులు కూడా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. సీపీఐ నుంచి రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఎం నుంచి పోతినేని సుదర్శన్ తదితరులు ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు. జనసేన మధిర మండలంలో పోటీచేస్తుండడంతో సినీనటుడు నాగబాబు సతీమణి పద్మజ ప్రచారానికి రావడం జరిగింది.

రెండో విడత ప్రచారం ముమ్మరం

జిల్లాలో ఈనెల 14న రెండోవిడత జరిగే ఎన్నికలకు ప్రచారం ముమ్మరంగా జరుగుతోంది. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, (మిగతా 8వ పేజీలో)

పంచాయతీ ఎన్నికల్లో
సూక్ష్మ పరిశీలకుల పాత్ర
అత్యంత కీలకం
భద్రాద్రి జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీరామ్ 7



ఆర్టీసీలో 'మహాలక్ష్మి'కి
రెండేళ్లు

- 2023లో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా పథకం ప్రారంభం
- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- ఖమ్మం రీజియన్‌లో మొత్తం రూ.400 కోట్లకు పైగా ఆదాయం

6

గంజాయి రవాణాను అరికట్టడంలో
భద్రాద్రి నెంబర్‌వన్



పట్టుకున్న గంజాయి, వ్యక్తులతో పోలీసులు

- ఈ ఏడాది రూ.30 కోట్ల సరుకు పట్టివేత
- తాజాగా రూ.కోటికి పైగా విలువైన గంజాయి పట్టివేత
- విలేకరుల సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ

భద్రాచలం, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణాను నియంత్రించడంలో భద్రాద్రి జిల్లా అగ్రగామిగా ఉందని ఎస్పీ రోహిత్‌రాజు వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో సుమారుగా రూ.30 కోట్ల విలువైన ఆరువేల కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. తాజాగా భద్రాచలంలో రూ.1,11,48,300 విలువైన 222.966 కేజీల నిషేధిత గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మీడియాకు తెలిపారు. భద్రాచలం ఎస్ఐ సతీష్ తమ సిబ్బందితో ఆదివారం రాత్రి కూనవరం రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా.. కూనవరం వైపు నుంచి భద్రాచలానికి నలుగురు వ్యక్తులు అశోక్ లేల్యాండ్ వాహనంలో వేగంగా వస్తూ పోలీసులను చూసి వెనుకకు మళ్లించినట్లు తెలిపారు. ఈ క్రమంలో వారు పారిపోయే ప్రయత్నం చేయగా.. వాహనాన్ని కొంత దూరం వెంబడించి పట్టుకొని భద్రాచలం ఆర్టీవో కార్యాలయం వద్ద తనిఖీ చేయగా 110 ప్యాకెట్లతో 222.966 కేజీల గంజాయి లభ్యమైందన్నారు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులతోపాటు గంజాయిని విక్రయించి కొనుగోలు చేస్తున్న వ్యక్తులపై కూడా కేసు నమోదు చేశామన్నారు. ఇప్పటివరకు ఏపీలోని చింతూరు మండలం మోతుగూడేనికి చెందిన కూరపాటి బుచ్చయ్య, సుకుమామిడికి చెందిన కలుముల రమేష్, హైదరాబాద్ టోలీచౌక్‌లోని బృందావన్ కాలనీకి చెందిన షేక్ షఫీవుద్దీన్, సాలార్జంగ్ కాలనీకి చెందిన మహమ్మద్ మౌసిన్‌లను అరెస్టు చేశామని వెల్లడించారు. వీరు సుకుమామిడి గ్రామంలో 110 ప్యాకెట్ల గంజాయిని సిద్ధం చేసి (బేళ్లు) కట్టల మధ్యలో బొలేరో వాహనంలో వేసుకొని మహారాష్ట్రలోని సోలాపూర్ ప్రాంతానికి వెళ్లి ప్రీతం పాత్రోకు అప్పగించడానికి భద్రాచలం మీదుగా టీఎస్07యుసీ 6969 వాహనంలో వెళ్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. తరచూ గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇరువురి చరాస్తులను కూడా స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. గంజాయిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ సతీష్, సీసీఎస్ సిబ్బందిని ఆయన అభినందించారు. గంజాయి రహిత జిల్లాగా భద్రాద్రిని చేయాలనే లక్ష్యంతో పోలీసుశాఖ గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్పీతో పాటు ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, సీఐలు నాగరాజు, రమాకాంత్, ఎస్ఐ సతీష్, రామకృష్ణలు పాల్గొన్నారు.

సారు రాలే.. బడి తెరవలే..

ఉపాధ్యాయుడు డుమ్మా కొట్టడంతో మూతపడ్డ ప్రభుత్వ పాఠశాల



తెరుచుకోని కొండెవాయి ప్రభుత్వ పాఠశాల

చర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) చర్ల మండలంలో విద్యావ్యవస్థ గాడి తప్పిదనడానికి ఇదే నిదర్శనం. చర్ల మండలం కొండెవాయి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉంది. 20మందికి పైగా ఆదివాసీ చిన్నారులు ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక రెగ్యులర్ టీచర్‌ని నియమించింది, కాగా సోమవారం ఆ ఉపాధ్యాయుడు పాఠశాలకు డుమ్మా కొట్టాడు. బడిలో ఉండాల్సిన విద్యార్థులు అడవుల్లో తిరుగుతూ కనిపించారు. ఉపాధ్యాయుడు బడికి రాలేదని స్థానికులు తెలిపారు. మరికొంత మంది నిత్యం ఇలానే బడి మూత పడుతోందని వాపోయారు. కాగా వేలకు వేల జీతాలు తీసుకునే ఉపాధ్యాయుడు విధులకు ఎగనామం పెట్టడంపై ఆదివాసీలు మండి పడుతున్నారు. ఉపాధ్యాయుడు బడికి తాళాలు వేసుకుని పోతుంటే స్థానిక కాంప్లెక్స్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. బడికి రావట్లేదని, వచ్చినప్పుడు చదువు చెప్పట్లేదని, పిల్లలకు అక్షరాలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల మూతపడ్డ విషయం చర్ల ఎంఈవో వెంకటరమణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, బడి మూతపడ్డ విషయం తన దృష్టికి రాలేదని, కాంప్లెక్స్ హెచ్‌ఎం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. సంబంధిత కాంప్లెక్స్ హెచ్‌ఎంను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ అందుబాటులోకి రాలేదు. కాగా గత కొంతకాలంగా అధికారులకు కూడా ఉపాధ్యాయుడు అందుబాటులో ఉండటంలేదని, పాఠశాలకు చెందిన రిపోర్టులు కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది. కాంప్లెక్స్ అధికారుల చొరవతో ఇదంతా సాగుతున్నట్టు తెలుస్తోంది.



బాబోయ్.. చలి!

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాలో భిన్నమైన వాతావరణం నెలకొంది. దిత్వా తుపాను ప్రభావంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉదయం 11 గంటల వరకు చలి చంపేస్తుంది. సాయంత్రం 5 అవుతుందంటేనే చల్లని గాలులతో చలి తీవ్రత జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉదయం 10గంటల వరకు సూరీడు కనిపించడంలేదు. సాయంత్రం చలికి జనం రోడ్లపైకి రావడంలేదు. వాతావరణశాఖ కూడా ఖమ్మం జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతాయంటూ చలిగాలులు వీస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. గత వారంరోజుల వరకు 20 డిగ్రీలున్న ఉష్ణోగ్రత రెండు రోజులుగా తగ్గుతూ ఆదివారం, సోమవారం 15 డిగ్రీలకు పడిపోయింది. జిల్లాలతో తెల్లవారుజామున పొగమంచు కమ్ముకొని ఉండటంతో బయటకు వెళ్లే పరిస్థితి లేదు. చలిగాలుల తీవ్రతకు గొంతునొప్పి, జలుబుతో జనం ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

ప్రశాంత ఎన్నికలకు ఏర్పాట్లు

- డీఆర్సీ వద్ద ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి
- రిటర్నింగ్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి
- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్



ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటిస్తూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. మూడువిడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11, 14, 17న జరిగే పంచాయతీ ఎన్నికలను ముందస్తు ప్రణాళికతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు సంబంధిత మండలంలో రిపోర్ట్ చేయాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు రిటర్నింగ్ అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ బృందాలు ఏర్పాటు చేశామని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్దకు సకాలంలో పోలింగ్ బృందాలు చేరుకోవడంతో పాటు సంబంధిత రిటర్నింగ్ అధికారికి రిపోర్ట్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రిజర్వు పోలింగ్ బృందాలు తప్పనిసరిగా విధులకు హాజరవ్వాలన్నారు. పోలింగ్ రోజు పూర్తి స్థాయిలో రిజర్వ్ బృందాలు డీఆర్సీలో అందుబాటులో ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాలు విశాలంగా ఏర్పాటు చేయాలని, అక్కడ సిబ్బంది భోజన ఏర్పాట్లు ప్రత్యేకంగా చేయాలని కలెక్టర్ సూచించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని, అక్కడ అవసరమైన మరుగుదొడ్లు, పోలింగ్ సిబ్బందికి సునాయసంగా తెలిసేలా సైన్ బోర్డులు, వాహనాల పార్కింగ్ అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలన్నారు. 174 పోలింగ్ లోకేషన్‌లో 992 పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని, వీటి ఏర్పాట్లు పక్కాగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, విద్యుత్ సరఫరా, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, ఎక్కడైనా చిన్న, చిన్న మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలన్నారు. పంచాయతీ ఎన్నికలలో ఉల్లంఘనలు జరగకుండా చూడాలని, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. స్థానిక పోలీస్ అధికారులతో తహసీల్దార్ సమన్వయం చేసుకుంటూ అవసరమైన చోట అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర బడ్జెట్ మొదటి దశ ఎంపీడీవోలకు విడుదల చేశామన్నారు. ఎన్నికల సిబ్బంది టీఏ,డీఏ, భోజన ఖర్చులకు అవసరమైన నిధులు విడుదల చేశామని ఎక్కడ కూడా సిబ్బంది నుంచి ఫిర్యాదు రావడానికి వీలు లేదని, ఎన్నికల సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందేలా చూడాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ముగ్గురు

భద్రాద్రి క్రికెటర్ల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

భద్రాచలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో జరగనున్న 14వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున భద్రాచలంలోని ముగ్గురు క్రికెటర్లు ఎంపికవడం విశేషం. భద్రాచలానికి చెందిన నక్కా రిత్విక్, రుషికేష్, పంజా విశృత్ కృష్ణలు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం అశ్వాపురంలో జరిగిన క్రికెట్ పోటీల నేపథ్యంలో వీరిని సెలెక్టర్లు జాతీయ స్థాయిలో నిర్వహించే అండర్-14 క్రికెట్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున ఎంపిక చేయడం జరిగింది. ఈ ముగ్గురు క్రికెటర్లు భద్రాచలంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ కోచ్ కుప్పాల తేజ వద్ద శిక్షణ పొందుతున్నారు.

ఐటీసీ కర్మాగారం పరిశీలన


పరిశ్రమను సందర్శిస్తున్న కలెక్టర్

బూర్గంపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సారపాకలో గల ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారాన్ని సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. సందర్శనలో భాగంగా యూనిట్ మేనేజ్‌మెంట్, ప్లాంట్‌లో అమలు చేస్తున్న ఆధునిక భద్రత ప్రమాణాలు, ఎనర్జీ ఎఫిషియెన్సీ చర్యలు, యంత్రాల పనితీరును మెరుగుపరచడంతో పాటు బ్రేక్‌డౌన్‌లను తగ్గించేందుకు చేపట్టిన టీపీఎం(టోటల్ ప్రొడక్టివ్ మెయింటెనెన్స్) విధానం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ హెడ్ శైలేందర్‌కుమార్ సింగ్, పేపర్, బోర్డు హెడ్ రాంబాబు, హెచ్‌ఆర్ హెడ్ శ్యామ్‌కిరణ్, అడ్మిన్‌హెడ్ చెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 'మహాలక్ష్మి'కి రెండేళ్లు

- 2023లో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా పథకం ప్రారంభం
- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- ఖమ్మం రీజియన్‌లో మొత్తం రూ.400కోట్లకు పైగా ఆదాయం



ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చి నేటికీ రెండేళ్లు పూర్తికానున్నది. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో 2023 డిసెంబరు 19న మహిళలకు ఉచిత ప్రయాణ పథకం మహాలక్ష్మిని సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రానికి చెందిన బాలికలు, విద్యార్థినులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీకి చెందిన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని ఆదేశాలు జారీచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 7 డిపోలలో మొత్తం 2023 డిసెంబరు 9 నుంచి 2025 డిసెంబరు 8 వరకు 8.94కోట్ల పై చిలుకు మంది మహిళా ప్రయాణికులు మహాలక్ష్మి పథకంతో ప్రయాణాలు సాగించారు. దీంతో సంస్థలకు సుమారు రూ.419 కోట్లకు పైగా ఆదాయం లభించింది. ఇందులో భద్రాద్రి కొత్తగుడెం నుంచి మొత్తం 4.63కోట్ల మంది మహిళలు ప్రయాణాలు సాగించారు. రూ.178.53 కోట్ల ఆదాయం, ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 4.87కోట్ల మంది మహిళా ప్రయాణికుల ప్రయాణాలు సాగించగా రూ.240.75 కోట్ల ఆదాయం లభించినట్లు రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. సంస్థకు ఆదాయం తోపాటు ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిందని, ప్రభుత్వం కల్పించిన ఈ ఉచిత ప్రయాణం పథకంతో ఎందరో పేద మధ్యతరగతి కుటంబాల మహిళలకు ఉపయోగకరంగా ఉందని ఆర్ఎం తెలిపారు. దీంతో వారి రోజు వారి ఖర్చులు తగ్గి ఆదాయం కొంత మెరుగుపడిందన్నారు. దేవాలయాలతో పాటు ఇతర టూరిజం ప్రాంతాలకు ప్రయాణికుల సంఖ్య బారీగా పెరిందని తెలిపారు. ఈ పథకం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని అన్నారు.

బెంచ్ ప్రెస్‌లో రాష్టస్థాయికి ఎంపిక


రవీందర్‌రెడ్డి

మణుగూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఆదివారం జిల్లా పవర్ లిఫ్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రెంచ్ ప్రెస్ పోటీల్లో 93 కేజీల విభాగంలో మణుగూరు స్కై జిమ్ నిర్వాహకుడు కొమరెల్లి రవీందర్ రెడ్డి 110 కేజీలను ఎత్తి రాష్ట్రస్థాయి టెస్ట్‌కు ఎంపికయ్యాడు. మణుగూరులో స్కై జిమ్ లో మాస్టర్‌గా ఉన్న రవీందర్‌రెడ్డి వద్ద శిక్షణ పొందిన నాగరాజు, పాండు రాజు, సుబ్బారావు, అబ్బాస్, నేహాల్ కూడా ఈ నెల 13 న ఖమ్మంలో జరిగే పవర్ లిఫ్టర్ పోటీల్లో పాల్గొన బోతున్నారు. మణుగూరు చెందిన ఈ క్రీడాకారులను పలువురు అభినందించారు.

తెలంగాణకు కేటాయించిన కంపా నిధుల వివరాలేంటి

- లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ


ప్రసంగిస్తున్న ఎంపీ

ఖమ్మం అర్బన్ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అడవులపునరుద్ధరణ, ప్రత్యామ్నాయ అటవీకరణ కోసం ఇచ్చే కాంపెన్సేటరీ ఆఫొరెస్టేషన్ మేనేజ్‌మెంట్ ప్లానింగ్ అథారిటీ (కంపా) నిధులను తెలంగాణకు ఇప్ప టి వరకు ఎన్ని కేటాయించారో వివరాలు తెలియజేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సోమవారం లోక్‌సభలో ప్రశ్నించారు. లోకసభ శీతాకాల సమావేశాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీరు, విద్యుత్ సహా వివిధ రకాల ప్రాజెక్టుల కోసం తీసుకునే అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ఇచ్చే భూములు నిధుల వివరాలను తెలియజేయాలన్నారు. ఎంపీ ప్రశ్నకు కేంద్ర పర్యావరణ అటవీ శాఖల సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ సమాధానమిస్తూ తెలంగాణకు ఇప్పటి వరకు 385261 కోట్ల నిధులు అందించినట్లు తెలిపారు. అడవుల పునురుద్ధరణ, వన్యప్రాణుల ఆవాసాలమెరుగుదల, జీవవైవిధ్యం కాపాడే కార్యకలాపాలకు వీటని వెచ్చిస్తామన్నారు. పరిహార అటవీకరణ నిధి ద్వారా ప్రణాళిక రూపొదించినట్లు చెప్పారు. కంపా నిధుల నుంచి రాష్ట్ర అటవీ శాఖకు పరిహార ఫండ్ కచ్చితంగా లభిస్తుందని వివరించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్



మాట్లాడుతున్న న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న నిర్వహించనున్న జాతీయ లోకదాలత్‌ను విజయవంతం చేయలని జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం సోమవారం న్యాయ సేవాధికార సంస్థలో ఇన్‌చార్జ్ కార్యదర్శి ఎం. కల్పన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు, దీనిలో రాజీ పడదగిన అన్ని కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. 695 క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు 450, బ్యాంకు కేసులు 100, భార్యాభర్తలకు సంబంధించిన కేసులు 150, మోటర్ ప్రమాద కేసులో 180, సివిల్ దావాలు 295, ఇతర కేసులు 2000 ఇప్పటివరకు గుర్తించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి వెంపటి అపర్ణ, అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శంకర్, ఇన్సూరెన్స్ న్యాయవాదులు బి. గంగాధర్, జి.సీత రామారావు, ఎస్ .రాము, కే. గుప్తా, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ బాలుర విజేతగా ఖమ్మం


ప్రథమ స్థానం సాధించిన ఖమ్మం బాలుర జట్టు

ఖమ్మం స్పోర్ట్స్ డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని సీక్వెల్ రిసార్ట్స్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) 69వ రాష్ట్రస్థాయి అండర్-17 బీచ్ వాలీబాల్ పోటీలలో ఖమ్మం జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. అంతే కాకుండా మెదక్ జట్టు ద్వితీయ, నిజామాబాద్ జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. బాలికల విభాగంలో విజేతగా నిజామాబాద్ జట్టు నిలవగా, ఖమ్మం జిల్లా జట్టు ద్వితీయ, హైదరాబాద్ జట్టు తృతీయ స్థానాలను సాధించాయి. నగరంలో సోమవారం నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా పాత జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను జిల్లా ఎస్‌జీఎఫ్ బాధ్యులు రామారావు, సైదులు, గోవిందరెడ్డి, ఆదర్శ్ చిన్ని, మధు సమీక్షించారు.

అర్హులైన దివ్యాంగులు యూడీఐడీ కార్డులు పొందాలి

- భద్రాద్రి అదనపు కలెక్టర్ విద్యా చందన



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అరు లైన దివ్యాంగులు యూడీఐడీ కార్డులు పొందాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన కోరారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనినా అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అడిషనల్ కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ జిల్లాలోని అరు లైన దివ్యాంగులు యూడీఐడీ కార్డులు పొందాలని, గతంలో పొందిన యూడీఐడీ కార్డులను సవరణలు పోర్టల్ ద్వారా చేసుకోవచ్చని, జిల్లాలో దివ్యాంగుల డ్వాక్రా సంఘాలుగా తయారయి, పొదుపు చేసి రుణాలు పొందడానికి వీలు కలుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న బీమా పథకాలను పొందాలని, దివ్యాంగులు ఎలాంటి సమస్యలు ఉన్న తమను సంప్రదిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. జడ్పీ సీఈవో, ఇన్‌చార్జ్ డీఈవో బి నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మండలంలో భవిత సెంటర్లు ఏర్పాటు చేశామని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ అందిస్తున్నామన్నారు. జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనీనా మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగులకు తమ శాఖ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలైన వివాహ ప్రోత్సాహక బహుమతి-దివ్యాంగులను సకలంగులు, దివ్యాంగులను దివ్యాంగులు వివాహం చేసుకున్న వారికి లక్ష రూపాయలు ప్రోత్సాహక బహుమతికి అర్హులని, టీజీ ఈపాస్ ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. వేడుకలలో ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులు విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ రంగాలలో దివ్యాంగుల సేవలు అందిస్తున్న వారిని సన్మానించారు. కార్యక్రమంలో సెర్ప్ సిబ్బంది, ఐఈడీ కోఆర్డినేటర్ సైదులు, బైండ్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్, బదిరుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డి, తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షులు సతీష్, మదర్ తెరిసా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కృష్ణ, వీహెచ్‌పీఎస్ సంఘం అధ్యక్షుడు సుధాకర్, అక్షయ దివ్యాంగుల సంఘం అధ్యక్షురాలు షమీం, ఎన్ పి ఆర్ డి సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జగ్గదాస్, బి.లక్ష్మణ్, ఎం.డి ముజాహిద్, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుతోనే పల్లెల్లో అభివృద్ధి వేగవంతం

- డిప్యూటీ సీఎం సతీమణీ మల్లు నందిని


ముష్టికుంట్లలో మాట్లాడుతున్న మల్లు నందిని

బోనకల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల గెలుపుతోనే త్వరితగతిన గ్రామాల అభివృద్ధి జరుగుతుందని డిప్యూటీ సీఎం సతీమణీ మల్లు నందిని తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం, బోనకల్ గ్రామాల్లో సోమవారం రాత్రి సర్పంచ్ అభ్యర్థులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఎర్రంశెట్టి శ్రీలత, భూక్యా మంగమ్మల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే ఆటంకం లేకుండా అభివృద్ధి పనులు సాగుతాయన్నారు. కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, బందం నాగేశ్వరరావు, బందం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని..

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్


మాట్లాడుతున్న ఏసీపీ వసుంధర యాదవ్

చింతకాని, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో ఎన్నికల నిర్వహణపై స్థానిక ప్రజాప్రతినిధులు, అభ్యర్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రజలు ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలన్నారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నియమనిబంధనలను పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీసులకు సహకరించి ఎన్నికల సజావుగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైరా ఏసీపీ సాంబరాజు, సీఐ వెంకటప్రసాద్, ఎస్ఐ వీరేందర్ పాల్గొన్నారు.

అవినీతి.. రాజ్యమేలుతోంది!

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న లంచావతారులు
- ఐదేళ్లలో 70మందికి పైగా పట్టుబడిన వైనం
- ప్రజల్లో చైతన్యం లేకపోవడం వల్లనే..
- గత రెండేళ్లలో మరింత పెరిగిన కేసులు

నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం



కొత్తగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెచ్చురిల్లుతోంది. పనులు చేయించుకోవాలంటే అసలు ఎందుకు పైసలు ఇవ్వాలి? వారు చేయాల్సిన పనే కదా? అనే విషయాన్ని చాలామంది సామాన్యులు మర్చిపోయే దుస్థితి వచ్చింది. గత రెండేళ్లలో నమోదైన కేసులను పరిశీలిస్తే.. అవినీతి సర్వసాధారణం.. కానీ వెలుగులోకి రావడం శోచనీయం అన్న రీతిలో ఉమ్మడి జిల్లాలో ఏసీబీ దాడుల్లో బయటపడిన కేసులను పరిశీలిస్తే అర్థమవుతోంది. గతంలోనూ అవినీతి ఉన్నా అది అంతటిస్థాయిలో బయటకు రాని పరిస్థితి ఉండేది. గత రెండేళ్లలో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఏసీబీ అధికారులు ఏ చిన్న అవకాశాన్ని కూడా వదలకుండా అధికారులపై నిఘా ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగానే గతంలో సింగిల్ డిజిటకే పరిమితమైన కేసుల సంఖ్య రెండేళ్లలో పదుల సంఖ్యలో నమోదయ్యాయి. గడిచిన ఐదేళ్ల కాలంలో 71కేసులు నమోదు కాగా.. 2021లో 9, 2022లో ఏడు, 2023లో ఏడు, 2024లో 19, 2025లో ఇప్పటివరకు 29 కేసులు నమోదయ్యాయి. కాగా గడిచిన రెండేళ్లలో కేసులు సంఖ్య పెరగడానికి ఏసీబీ అధికారులు పనితీరే కారణంగా కనిపిస్తోంది. గతానికి భిన్నంగా కేసులు నమోదు చేయడంతో అవినీతి అధికారుల్లో వణుకు పుడుతోంది. వాస్తవానికి లంచం అడగడం, తీసుకోవడం కూడా నేరమే అన్న చట్టం ఉన్నా గతంలో కేవలం లంచం తీసుకోవడాన్నే నేరంగా పరిగణించి కేసులు నమోదు చేసేవారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో లంచం అడిగినట్టు ఆధారాలున్నా కేవలం కేసులు నమోదు చేసి రిమాండ్ మాత్రమే చేస్తున్నారు. ఆ తర్వాత చర్యలేంటన్నదానిపై పట్టింపు ఉండటం లేదని.. దాని ఫలితంగానే ఉమ్మడి జిల్లాలో కేసుల సంఖ్య పెరిగినట్టుగా స్పష్టమవుతోంది.

ఆజ్యం పోసింది పౌరులేనా?

అసలు అధికారులకు లంచాలు అలవాటు చేసింది పౌరులేనని, కొందరు తమ పనులను చేయించుకునేందుకు వారికి డబ్బు ఆశచూపి అడ్డదారి తొక్కించారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నుంచి ప్రజల సొమ్మును జీతాలుగా పొందుతున్న అధికారులు.. ప్రజాప్రయోజనాల కోసం పనిచేయాల్సిన అవసరం ఉంది. అలాంటి అధికారులకు కొందరు వ్యక్తులు తమ పని తొందరగా కావాలంటూ డబ్బులు చెల్లిస్తూ పనులు చేయించుకుంటున్నారు. ఇలా క్రమక్రమంగా లంచాలు తీసుకునేవారితోపాటు ఇచ్చేవారి సంఖ్య కూడా పెరిగిపోయింది. కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగి వేసారుతున్న కొందరు చివరకు ఎంతోకొంత ఇచ్చి పనులు చేయించుకుంటున్నారు. కాస్తంత చైతన్యం కలిగినవారు మాత్రమే ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. శాఖతో సంబంధం లేకుండా అవినీతి రాజ్యమేలుతోందనడానికి ఇటీవల కాలంలో అవినీతి అధికారులు ఏసీబీకి పట్టుబడిన సంఘటనలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. గతేడాది పట్టుబడిన కేసుల్లో పోలీసు, రెవెన్యూ, విద్యుత్‌శాఖ, ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ, సర్వే అండ్ లాండ్ డిపార్ట్‌మెంట్, విద్యాశాఖ, సబ్‌రిజిస్ట్రార్ ఇలా.. ఒకటేంటి ప్రతీ శాఖనుంచి అవినీతి అధికారులు చిక్కారు.

ఏసీబీకి పట్టుబడిన కేసుల్లో కొన్ని..

- మృతిచెందిన భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి పరిహారం మంజూరు చేయడానికి అతడి భార్య నుంచి రూ. 15వేలు లంచం తీసుకుంటుండగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కర్నె చందర్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన ఓ రైతు మరో రైతు వద్ద కొనుగోలు చేసిన 15 కుంటల భూమిని భూభారతి ద్వారా రిజిస్ట్రేషన్ చేసేందుకుగాను రూ.10వేలు లంచం డిమాండ్ చేయగా..లంచం తీసుకునే సమయంలో ఎమ్మార్వో వంకాయల సురేష్‌కుమార్‌తో పాటు ఆర్ఐ భాస్కర్, కంప్యూటర్ ఆపరేటర్ శివాజీరాథోడ్‌ను పట్టుకున్నారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు విషయంలో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.40వేలు డిమాండ్ చేయగా.. బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా ఆడియో, వీడియో టేపుల ద్వారా ఎస్ఐ రంజిత్‌ను అరెస్ట్ చేశారు.
- ముల్కలపల్లి ఎమ్మార్వో కార్యాలయంలో జీపీవోగా పనిచేస్తున్న బానోత్ శ్రీనివాస్ నాయక్ పూసుగూడెం వ్యవసాయభూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రూ.60వేలు లంచం డిమాండ్ చేసి 40వేలు తీసుకోగా.. మరో రూ. 15వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.
- యూరియా అమ్మకాలకు సంబంధించి షోకాజ్ నోటీసు ఇచ్చి దాన్ని ఉపసంహరించుకునేందుకు లక్ష్మీదేవిపల్లి బంగారుచెలక గ్రామంలోని ఫెర్టిలైజర్ దుకాణ యజమాని నుంచి రూ. 25వేలు లంచం తీసుకుంటుండగా. వ్యవసాయశాఖ ఏడీ నర్సింహారావు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.
- సీజ్ చేసిన రేషన్ దుకాణాన్ని తెరిచేందుకు రూ. 30వేలు లంచం తీసుకుంటుండగా.. సివిల్ సప్లై డీటీని ఏసీబీ అధికారుల అరెస్ట్ చేశారు.

లంచం అడిగితే మాకు సమాచారం ఇవ్వండి : రమేష్, ఏసీబీ డీఎస్పీ

ప్రభుత్వ ఉద్యోగులు వివిధ పనుల నిమిత్తం లంచాలు అడిగితే ప్రజలు జిల్లాలోని అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. సదరు ఉద్యోగులపై ఏ విషయంలో ఫిర్యాదు చేసేది లిఖితపూర్వకంగా జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు. అవినీతి నిరోధకశాఖ టోల్ ఫ్రీ నెంబరు 1064కు ఫిర్యాదు చేయొచ్చు.

1064తో అవినీతికి అడ్డుకట్ట : కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్: అవినీతిని నిరోధించేందుకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని, 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కోరారు. అవినీతి నిరోధక వారోత్సవాల సందర్భంగా సోమవారం తన చాంబర్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణలో జవాబుదారీతనంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం ఇవ్వమని వేధిస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వ అధికారులతో పని చేయించుకోవడం ప్రజల హక్కు అని, ఆ హక్కును లంచంతో కొనవద్దని, ఎట్టి పరిస్థితుల్లో ఎవరికి ఏ పని కోసం ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ వై.రమేష్, సీఐ బి.బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ రంగం నిలబడితే.. వేల కుటుంబాలకు జీవనోపాధి

- యాజమాన్యాలు వాతావరణం ... కాలుష్య నివారణ జాగ్రత్తలు చేపట్టాలి
- చిన్న, మధ్య తరహా పరిశ్రమల.. ప్రోత్సాహానికి ప్రత్యేక కార్యాచరణ
- గ్రానైట్ యూనిట్ల సందర్శనలో కలెక్టర్ అనుదీప్


గ్రానైట్ పరిశ్రమలో మెటీరియల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ రంగం నిలబడితే వేల కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని, త్వరలోనే పరిశ్రమ ప్రతినిధులతో విస్తృత సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికను సిద్ధం చేస్తామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం ఖమ్మం ఖానాపురం ఇండస్ట్రియల్ కాలనీలోని గ్రానైట్ పారిశ్రామిక ప్రాంతాన్ని సందర్శించిన ఆయన పరిశ్రమల స్థితిగతులను, పరిస్థితులను తెలుసుకున్నారు. పలు గ్రానైట్ యూనిట్లలో జరుగుతున్న ఉత్పత్తి, ప్రాసెసింగ్ పనుల గురించి తెలుసుకున్నారు. విద్యుత్ చార్జీలు, ఎగుమతి సమస్యలు, మార్కెట్ డిమాండ్ తగ్గుదల, ముడి సామగ్రి రవాణా వ్యయాల పెరుగుదల లాంటి పలు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమకు పునరుద్ధరణ మార్గాలు చూపించే దిశగా ప్రభుత్వం తరుపున అభివృద్ధికి ముందడుగు వేస్తున్నామన్నారు. పరిశ్రమల విస్తరణస్ర, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూనే మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలను అవసరమైన సహకారం అందించడానికి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. పరిశ్రమల బలోపేతంతో ఉపాధి అవకాశాలు పెరిగి స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. ఖమ్మం అభివృద్ధి కోసం గ్రానైట్ పరిశ్రమల పురోగతి అత్యవసరమని, ఈ ప్రాంత యువతకు పారిశ్రామిక అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తామన్నారు. గ్రానైట్ యాజమాన్యాలు వాతావరణం కాలుష్య నివారణకు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రతలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ పర్యటనలో జిల్లా పరిశ్రమలు శాఖ జనరల్ మేనేజర్ సీతారాం నాయక్, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, టీజీ ఐఐసీ డీఈ స్మరత్‌చంద్ర, జేఈ శివకుమార్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, గ్రానైట్ పరిశ్రమల యజమానులు జగదీష్, తమ్మినేని సాగర్, రాంభద్రయ్య, కార్మికులు, అధికారులు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

పాఠశాల నుంచి అనుమతి లేకుండా బయటకు వెళ్లిన విద్యార్థి

కారేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి (శాంతినగర్)ఆశ్రమపాఠశాలలో 9వతరగతి చదువుతున్న బాణోత్ సాగర్ అనే విద్యార్థి ఆదివారం పాఠశాలలో ఎలాంటి అనుమతి లేకుండా బయటకు వెళ్లి ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలయ్యాడు. అయితే ప్రమాదానికి గురైన విద్యార్థికి ఉపాధ్యాయులు చికిత్స చేయిస్తున్న విషయాన్ని గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తోంది. రఘునాధపాలెం మండలం దోనబండకు చెందిన బాణోత్ సాగర్ ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో ఉంటూ 9వతరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ప్రధానోపాధ్యాయుడు, హాస్టల్‌వార్డెన్ పాఠశాలలో అందుబాటులో లేరు. దీంతో ఆ విద్యార్థి అనుమతి లేకుండా సమీపంలోని ఇల్లెందు వెళ్లాడు. తిరిగి వసతి గృహానికి వచ్చే క్రమంలో ఇల్లెందు పట్టణంలోని కరెంట్ ఆఫీస్ వద్ద మోటర్‌సైకిల్‌తో వస్తున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగాడు. విద్యార్థి ఎక్కిన మోటర్‌సైకిల్ ఎదురుగ వస్తున్న మరో మోటర్ సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో వెనకాల కుర్చున విద్యార్థి సాగర్ తలకు బలమైన గాయం కావడంతో మోటర్‌సైకిల్ వాహనదారులు విద్యార్థిని అక్కడే వదిలివేసి వెళ్ళిపోయారు. గాయపడిన విద్యార్థి ఫోన్ ద్వారా తన తండ్రికి సమాచారం అందించాడు. తండ్రి ఇదే విషయాన్ని హాస్టల్‌వార్డెన్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఉపాధ్యాయులు సంఘటన స్థలానిక చేరుకుని సాగర్‌ను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు.

అభ్యర్థులు డబ్బులిచ్చినా.. బెదిరించినా... నేరమే

జైలు శిక్షలతో పాటు జరిమానాలు తప్పవు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓటు అనేది వజ్రాయుధం వంటిది. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి అద్దం పడతాయి. ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఎలాగైనా గెలవాలని రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ప్రధానంగా ఓటర్లకు డబ్బు, మద్యం పంచటం, బెదిరింపులకు పాల్పడటంతో పాటు ఎదుటి వ్యక్తిపై తప్పుడు ప్రచారం వంటి ప్రలోభాలకు పాల్పడుతుంటారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు వేళ పల్లెల్లో రకరకాల ప్రలోభాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నికల వేళ ఇటువంటి ప్రలోభాలకు పాల్పడితే భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)-2023 ప్రకారం పలు శిక్షలతో పాటు జరిమానా కూడా విధిస్తారు. ఎన్నికల వేళ ఎవరైనా నేరాలకు పాల్పడినపుడు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తారు. నేరాలు నిరూపణ అయినపుడు తగిన శిక్షలు విధిస్తారు.



● బెదిరింపులు, ఒత్తిడి చేయడం..

అభ్యర్థులు వారికి అనుకూలంగా ఓటు వేయాలని ఓటర్లను బెదిరించటం, వారిపై వివిధ రూపాల్లో ఒత్తిడి తేవడం జరుగుతుంది. కొందరు వైరంతో కూడిన ప్రచారం చేయటం చేస్తుంటారు. ఇది కూడా నేరంగానే పరిగణిస్తారు. 171సీ కింద కేసు నమోదు చేసి విచారణ చేపడతారు. ఇది నిరూపణ అయితే ఏడాది జైలుశిక్ష పడే అవకాశం ఉంది. జరిమానాలు విధిస్తారు.



● ఖర్చు చూపకున్నా...

నిబంధనల ప్రకారం అభ్యర్థులు నిధులు ఖర్చు చేయాలి. ఎన్నికల అనంతరం అభ్యర్థులు తప్పకుండా ఖర్చు చేసిన వివరాలను ఎన్నికల అధికారులకు సమర్పించాలి. ఎన్నికల ఖర్చులు సంబంధిత అధికారులకు సమయంలోపు చూపించకపోతే రూ.500 జరిమానా విధిస్తారు.



● డబ్బుతో ప్రలోభ పెట్టడం..

ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు ఆశచూపటం, మద్యం పోయటంతో పాటు వస్త్రాలు, బహుమతులు ఇవ్వటం, ఇతర సాయం చేసి ఓటు అడగటం నేరం. ఎన్నికల సమయంలో ఇటువంటివి జరుగుతున్నట్లు ఎన్నికల అధికారుల దృష్టికి వచ్చినపుడు అధికారులు విచారణ చేస్తారు. ఒక వేళ నేరం రుజువు అయితే సెక్షన్ 171బీ కింద ఏడాది పాటు జైలు, జరిమానా విధిస్తారు. అభ్యర్థులతో పాటు ఓటు కోసం డబ్బులు తీసుకున్న వారికీ శిక్ష విధించవచ్చు. ఎన్నికల సమయంలో అభ్యర్థుల తరుపున ఎవరైనా ఇలాంటి వాటికి పాల్పడితే చర్యలు తప్పవు.



● తప్పుడు ప్రచారం చేసినా..

బరిలో నిలిచిన అభ్యర్థులపై కొందరు దుష్ప్రచారాలు చేస్తుంటారు. ఫలితాలను ప్రభావితం చేసేలా ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థి వ్యక్తిత్వం గురించి ప్రచారాలు చేస్తుంటారు. అభ్యర్థికి వివాహేతర సంబంధాలు ఉన్నాయని, స్మగ్లర్ అని, నేరాలు చేశాడని, మంచివాడు కాదని, అతనిది ... కులం, మతం అంటూ ప్రచారాలు చేస్తుంటారు. ఇలా ప్రచారాలు చేయటం కూడా నేరంగానే ఉంటుంది. నిరూపణలు అయితే ప్రచారం చేసిన వారికి జరిమానాలు విధిస్తారు.



● దొంగ ఓట్లు వేయటం..

పోలింగ్ వేళ చనిపోయిన వారి పేరు మీద దొంగ ఓట్లు వేయాలని కొందరు ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు మారుపేరుతో ఓటు వేయటం, ఒకసారి ఓటు వేసినా మరోసారి ఓటు వేయాలని ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు దొంగ ఓట్లను వేసేలా ఇతరులను ప్రోత్సహించటం కూడా చేస్తుంటారు. ఇవి కూడా ఎన్నికల వేళ తీవ్ర నేరాలుగా పరిగణిస్తారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారికి ఏడాది పాటు జైలుశిక్ష ఉంటుంది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం...

ఎన్నికల వేళ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. గ్రామాల్లో అసత్య ప్రచారాలు చేయుటం. ఘర్షణలకు పాల్పడటం, పోలింగ్ రోజున కేంద్రాల్లోకి అనుమతి లేకుండా చొరబటం, ఇతర నేరాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతారు. నేరాన్ని బట్టి పోలీసులు వివిధ సెక్షన్లను బట్టి జైలు శిక్షలు ఉంటాయి.

నేను సైతం..

'పంచాయతీ'లో నాగబాబు సతీమణి ప్రచారం



మాటూరుపేటలో పద్మజకు స్వాగతం పలుకుతున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

మధిర రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో సినీనటుడు, ఏపీ ఎమ్మెల్సీ జనసేన నేత కొణిదల నాగేంద్రబాబు (నాగబాబు) సతీమణి పద్మజ పాలుపంచుకుంటున్నారు. ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరుపేట గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనసేన బలపరిచిన సర్పంచ్ అభ్యర్థినిగా పోటీచేస్తున్న తోట దీపకళ తరపున ఆమె సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన ఆమెకు జనసేన, బీఆర్ఎస్, బీజేపీ నేతలు, స్థానికులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నాయకులు తాళ్లూరి డేవిడ్, అభ్యర్థిని దీపకళ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏలూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాడు కొత్తగూడెం ఎంపీపీ.. నేడు రుద్రంపూర్ సర్పంచ్ బరిలో!

చుంచుపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన 2014 సంవత్సరంలో కొత్తగూడెం తొలి ఎంపీపీగా పని చేసిన బాణోత్ కెస్లీ నేడు రుద్రంపూర్ సర్పంచ్‌గా పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కొత్తగూడెం మండలం మూడు మండలాలుగా విడిపోవడంతో చివరి కొత్తగూడెం ఎంపీపీగా నిలిచిపోయారు ఆమె. నాడు కొత్తగూడెం ఎంపీపీ నేడు రుద్రంపూర్ సర్పంచిగా బరిలో దిగి ప్రజల్లో తనపై ఉన్న నమ్మకంతో అభిమానాన్ని పొంది మరోసారి సర్పంచిగా గెలుపొందాలని ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్నారు. 2006లో రుద్రంపూర్ సర్పంచ్‌గా సీపీఐ పార్టీ తరుపున పోటీ చేసి గెలుపొంది తన రాజకీయ ప్రస్థానానికి నాంది పలికారు. 2011 సంవత్సరంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో సీపీఐ పార్టీ తరుపున బరిలో దిగి రెండోసారి కూడా సర్పంచ్‌గా గెలుపొందారు. అదేవిధంగా 2014లో చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్ మేజర్ పంచాయతీలో గల రుద్రంపూర్ ఎంపీటీసీ స్థానంకు సీపీఐ పార్టీ తరుపున పోటీ చేసి గెలుపొందారు. ఈ క్రమంలో కొత్తగూడెం ఎంపీపీగా నియమితులై విధులు నిర్వహించారు. ప్రస్తుతం 2025లో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని రుద్రంపూర్ సర్పంచి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. రెండుసార్లు సర్పంచ్‌గా, ఒకసారి కొత్తగూడెం ఎంపీపీగా పని చేసిన అనుభవంతో ఇప్పుడు జరిగే సర్పంచ్ ఎన్నికల్లో మరోసారి గెలుస్తానని బాణోత్ కెస్లీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రుద్రంపూర్ పంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థి బాణోత్ కెస్లీ



వివాదాలకు తావివ్వొద్దు!

ఆర్‌వోల సమావేశంలో భద్రాద్రి కలెక్టర్

చంద్రుగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్‌ల్లో, ఓట్లు లెక్కింపు సమయంలోను ఎటువంటి వివాదాలకు తావివ్వకుండ వ్యవహరించాలని ఆర్‌వోలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం చంద్రుగొండ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల నిరాహణపై అధికారులు, ఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లోని సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పోలింగ్ వేగంగా జరిగే విధంగా చూడాలని, ఏదైన సమస్యలు ఏర్పడితే సంబధిత పైఅధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కౌంటింగ్ అనంతరం సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నిక ప్రకటించి ఆ వెనువెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా అధికారులు, సిబ్బంది సెలవులు తీసుకోవద్దని ఆదేశించారు. అనంతరం బ్యాలెట్ బాక్సలతో పాటు ఎన్నికల సామగ్రిని పరిశీలించారు.

నియమావళిని అతిక్రమించొద్దు : వ్యయ పరిశీలకురాలు లావణ్య

ఎన్నికల కోడ్ ముగిసేవరకు అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలని, లేదంటే నిబంధన ప్రకారం ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందని జిల్లా వ్యయ పరిశీలకురాలు లావణ్య తెలిపారు. సోమవారం చంద్రుగొండ రైతు వేదికలో అభ్యర్థులకు నియమావళిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశంలో ఆమె ఎన్నికల నియమావళిని అభర్థులకు వివరించారు. ప్రచార వాహనాలు, ర్యాలీలు, మీటింగ్‌లకు సంబంధిచిన నిబంధనలు తెలుసుకోవాలని, అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అభ్యర్థులు చేసే ఖర్చును ప్రతి రోజు సంబంధిత అధికారికి నివేదించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ ఎన్నికలు ముగిసే వరకు ఎటువంటి ఘర్షణలు జరగకుండా అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల వేళ నమోదు అయ్యే కేసులు కఠినంగా ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ఎన్నికల అధికారులు తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో బి అశోక్, సీఐ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



బ్యాలెట్ బాక్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

నువ్వా.. నేనా..

పోటీకి సై అంటున్న తోటి కోడళ్లు

రసవత్తరంగా కాకర్ల పంచాయతీ పోరు



బానోత్ బుల్లి



బానోత్ గమ్మ



బానోత్ బద్రి

జూలూరుపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఒక్కటే.. పోటీలో మాత్రం ముగ్గురు. ఒకే పార్టీ తరపున ముగ్గురు వేర్వేరుగా నామినేషన్లు సమర్పించడం అదీ ముగ్గురు తోటి కోడళ్లు కావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. జూలూరుపాడు మండలంలోని కాకర్ల పంచాయతీ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ మహిళకు కేటాయించారు. దీంతో సర్పంచ్ స్థానం నుంచి స్వయాన తోటి కోడళ్లయిన దుబ్బతండాకు చెందిన బానోత్ బుల్లి, బానోత్ గమ్మ, బానోత్ బద్రిలు ముగ్గురు పోరుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఈ ముగ్గురు మహిళలు పోటీకి తలపడుతుండడంతో ఈ స్థానం రసవత్తర పోరుకు తెరలేచింది. పంచాయతీలో 2357 ఓట్లు ఉండగా ఓటర్లు ఈ ముగ్గురిలో ఎవరిని ఆదరిస్తారో వేచిచూడాల్సి వుంది.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకం

భద్రాద్రి జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీరామ్



ఎన్నికల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి శ్రీరామ్

కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర చాలా ప్రముఖమైనదని ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీరామ్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్ల) శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీరామ్ మాట్లాడుతూ రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించడంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. మూడువిడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే మైక్రో అబ్జర్వర్లు తమ తమ పోలింగ్‌స్టేషన్లకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభానికి ముందు, పోలింగ్ సమయంలో, పోలింగ్ ముగిసిన తరువాత ప్రతి దశలోనూ సూక్ష్మంగా పరిశీలించి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు.పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి అంశాన్ని నిశితంగా గమనించి, ఎన్నికల నియమావళి ఖచ్చితంగా అమలవుతున్నదేనా అనే విషయాన్ని అంచనావేసి తగిన నివేదికను సాధారణ పరిశీలకులకు సమర్పించాలని శ్రీరామ్ ఆదేశించారు. ఎలాంటి అనుచిత చర్యలు, నిబంధనల ఉల్లంఘనలు గమనించిన వెంటనే సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో స్వేచ్ఛా, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణకు సూక్ష్మపరిశీలకుల సేవలు అత్యంత ముఖ్యమైనవని ఈ సందర్భంగా నోడల్ అధికారి హితవు పలికారు. ఈశిక్షణ కార్యక్రమంలో అదనపు ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సాయి కృష్ణ, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వాణిజ్య సంస్థ, దుకాణం, వ్యాపార సంస్థలలో పనిచేసే కార్మికులకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటిదశ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో పోలింగ్ కోసం ఉపయోగిస్తున్న కార్యాలయ, విద్యాసంస్థల భవనంలో ఉన్న సిబ్బందికి, విద్యార్థులకు ఎన్నికల ముందు రోజు అనగా ఈ నెల 10వ తేదీన, అలాగే రెండవ దశ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో 13వ తేదీన, మూడో దశ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో 16వ తేదీన లోకల్ హాలిడే, ఎన్నికల రోజున ఎన్నికలు జరిగే ప్రాంతాలలో స్థానికంగా సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. దుకాణ, వాణిజ్య సంస్థల యజమానులకు, వ్యాపార సంస్థల యజమానులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల సందర్భంగా దుకాణ, వ్యాపార, వాణిజ్యసంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులకు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

అనారోగ్యంతో పతకాల వీరుడు అస్తమయం

నివాళులు అర్పించిన పలువురు నాయకులు



బాగం నారాయణ (ఫైల్)

సుజాతనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ మండలం కొత్త అంజనాపురం గ్రామానికి చెందిన బాగం నారాయణ(101) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ప్రపంచ దేశాల్లో అథ్లెటిక్స్‌లో రన్నింగ్ వెటరన్ క్రీడాకారుడిగా ఎన్నో బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు పొందాడు. 1924లో జన్మించిన ఈయన రన్నింగ్ వెటరన్ క్రీడాకారుడిగా ఎంతో పేరు తెచ్చుకున్నాడు. ఆయన జీవితంలో 5 కిలోమీటర్ల దూరాన్ని రన్నింగ్ వెటరన్‌గా 28 నిమిషాల్లో చేరుకున్నదే అతి గొప్ప విజయమన్నారు. కానీ ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడవడం కుటుంబానికి తీరనిలోటని ఆయన కుమారుడు బాగం కృష్ణ అశ్రునయనాల మధ్య తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోనేరు సత్యన్నారాయణ (చిన్ని), పలుపార్టీల నాయకులు, డాక్టర్లు తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

ఫ్రీ... ఫ్రీ...

గెలిపిస్తే కటింగ్, గడ్డం ఫ్రీ..

వివాహ వేడుకలో గోళ్లు తీయటం కూడా..

దమ్మపేట మండలం నాగుపల్లిలో ఓ వార్డు అభ్యర్థి హామీలు

దమ్మపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు గెలుపు కోసం ప్రయాసలు పడుతున్నారు. ఈ క్రమంలో వారు ఓటర్లకు అనేక హామీలను ఇస్తున్నారు. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామం పదో వార్డుకు చెందిన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న నూజివీటి సర్వేశ్వరరావు వినూత్న హామీలు ఇస్తున్నారు. తనను గెలిపిస్తే ఐదు ఏళ్ల పాటు వార్డు ఓటర్లకు కటింగ్, గడ్డం ఉచితంగా చేస్తానని, అదే విధంగా వివాహ వేడుకల్లో గోళ్లు తీసే సంప్రదాయాన్ని ఉచితంగా చేస్తానంటూ ప్రచారం చేస్తున్నాడు. దీంతో గ్రామంలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. నాగుపల్లి గ్రామంలో 14న ఎన్నిక జరగనుంది.

ఆకస్మిక తనిఖీ

అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలి

భద్రాచలం ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ రోహిత్‌రాజు



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచలం, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): అక్రమ నగదు, మద్యం రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. భద్రాచలంలో సోమవారం బ్రిడ్జివద్ద ఉన్న ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును ఎస్పీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వాహనంను క్షుణ్నంగా తనిఖీ చేయాలని పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నగదు, మద్యం వంటి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, సీఐ నాగరాజు, ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

ముజ్జుగూడెం కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఇంటిపై రాళ్లదాడి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సహా 13మందిపై కేసు నమోదు

నేలకొండపల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ముజుగూడెం గ్రామ పంచాయతీకి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీపడుతున్న బొడ్డు రేణుక ఇంటిపై సోమవారం తెల్లవారుజామున బీఆర్ఎస్ నాయకులు రాళ్లదాడికి పాల్పడినట్లు సోమవారం నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బొడ్డు రేణుక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం పూర్తి చేసుకుని రాత్రి 10 గంటల సమయంలో నిద్రపోయాం. సుమారు అర్ధరాత్రి 1 గంట సమయంలో ఇంటిముందు రోడ్డుపై పెద్దపెద్దగా మాటలు వినపడుతుండటంతో నేను, నా భర్త శ్రీనివాసరావు నిద్రలేచి చూడగా బీఆర్ఎస్ నాయకుడు ఉన్నం బ్రహ్మయ్య, దండా సూర్యనారాయణలు మరికొంత మందితో ఇంటి ముందు అరుస్తూ నిలబడి ఉన్నారు. ఇంత రాత్రి సమయంలో మా ఇంటి వద్ద మీకేం పనంటూ అడగ్గా దళితురాలైన తనను కులం పేరుతో దూషిస్తూ దగ్గర ఉండి తమ వెంట వచ్చిన వారితో ఇంటిపై దాడి చేయండంటూ కర్రలు, రాళ్లతో దాడి చేయించారు. భయంతో ఇంట్లోకి పరిగెట్టి తలుపులు వేసుకోగా, కర్రలు, రాళ్లతో తలుపులు, కిటికీలపై కొడుతూ కులంపేరుతో పెద్ద పెద్దగా అరుస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. భయంతో 100కు డయల్ చేయగా పోలీసులు వచ్చి అక్కడినుంచి వారిని పంపించి వేశారు. వెళుతూ వెళుతూ మిమ్మల్ని ఎప్పటికైనా చంపుతామంటూ పెద్దగా అరుస్తూ బెదిరించారు. దాడి చేసిన వారిలో ఉన్నం బ్రహ్మయ్య, దండా సూర్యనారాయణ, షేక్.ఖాజమియా, చేమ మధు, బొడ్డు వీరబాబు, బొడ్డు అన్వేష్, నూకల అబ్రహం, బొడ్డు వీరబాబు, బొడ్డు వసంతరావు, నూకల ప్రశాంత్, నున్నా శ్రీనాద్, నల్లమల నిరంజన్, మాదాసి ఏసు తదితరులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే న్యాయం చేయాలని ఫిర్యాదులో బొడ్డు రేణుక పోలీసులను కోరింది.

పలు సెక్షన్ల కింద కేసులు నమోదు

కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి బొడ్డు రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపారు. పోలీసు జాగిలాలను గ్రామంలోకి రప్పించి దాడి జరిగిందని చెపుతున్న ఇంటి వద్ద వదిలారు. అనంతరం ఉన్నం బ్రహ్మయ్య, దండా సూర్యనారాయణలతో సహా 13 మందిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తదుపరి విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తికి జైలుశిక్ష

ఇల్లెందుటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తికి జైలుశిక్ష విధిస్తూ సోమవారం ఇల్లెందు కోర్టు జడ్జి దేవరపల్లి కీర్తిచంద్రికరెడ్డి తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2016లో సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఇల్లెందు పట్టణంలోని గోవింద్ సెంటర్‌కు చెందిన గాదె మల్లయ్య అనే రిటైర్డ్ కార్మికుడి వద్ద నుంచి సిలివేరు సదానందం, మచ్చ వెంకన్నలు రూ.6.50లక్షలు తీసుకున్నారు. రిటైర్డు కార్మికుడైన మల్లయ్య తన కుటుంబసభ్యుడికి ఉద్యోగం ఇప్పించాలని డబ్బులు ఇచ్చినప్పటికీ.. ఉద్యోగం చూపపోవడంతో పాటు డబ్బులు అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారని ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు సదానందం, మచ్చవెంకన్నలపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన ఇల్లెందు జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తిచంద్రికరెడ్డి నేరం రుజువుకావడంతో ఏ-1 ముద్దాయి సిలివేరు సదానందంకు మూడు ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ నర్సింగ్ అనిల్‌కుమార్ వాదించగా విచారణ అధికారి తాటిపాముల సురేశ్, కోర్టు పీసీ పోశాలు, అనంతరాములు, అశోక్‌లు సహకరించారు.

గొర్రెల దొంగల అరెస్ట్

ఖమ్మం క్రైం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): గొర్రెల దొంగతనం చేసిన ఐదుగురిపై ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ నందు సోమవారం కేసు నమోదైంది. ఖమ్మం నగరంలోని టేకులపల్లి డైట్‌కాలేజీ సమీపంలో యరదేశి వెంకటేశ్వర్లు, మల్లయ్య అనే వ్యక్తులు గొర్రెలను మేతకు తోలుకుని వెళ్లారు. ఆటోలో వచ్చిన ఐదుగురు వ్యక్తులు గొర్రెలను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని పట్టుకొని ఖానాపురంహవేలి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మసీదు కాంప్లెక్స్ ఎదుట క్షుద్ర పూజలు..?

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) కల్లూరు పట్టణంలోని ఓ మసీదు కాం ప్లెక్స్ ముందు గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో స్థానికంగా మెయిన్ సెంటర్‌లోని మసీదు షాపింగ్ కాంప్లెక్స్ ముందు జనసంచారంలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సదరు ప్రదేశానికి చేరుకొని కుంకుమ, పసుపు, నిమ్మకాయలు, కోడిగుడ్డులు వాడి పూజలు చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సోమవారం ఉదయం 8గంటల సమయంలో పలువురు ముస్లింలు సదరు ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. ఈ ఘటన ముస్లిం సామాజికవర్గంలో చర్చినీయాంశంగా మారింది. ఈ ఘటనపై ముస్లిం ప్రముఖులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సదరు ప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తులు పూజల కోసం వినియోగించిన పసుపు, కుంకుమ తదితర సామగ్రిని సేకరించారు. మండల ముస్లిం అధ్యక్షుడు సయ్యద్ రవూఫ్, సయ్యద్ ఆలం, అక్బర్ తదితరులు పూజల ప్రదేశాన్ని పరిశీలించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నిందితులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ముస్లింలు ప్రభుత్వ అధికారులను కోరుతున్నారు.



నేడు జర్నలిస్టులకు పోస్టల్ బీమాపై అవగాహన సదస్సు

ఖమ్మంచర్చికాంపౌండ్/ ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు బీమా సౌకర్యం, రిజిస్ట్రేషన్ పై నేడు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఖమ్మం ప్రెస్‌క్లబ్ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11గంటలకు జరిగే ఈసదస్సును జర్నలిస్టులు సద్వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి హాజరవుతారని తెలిపారు. బీమా సౌకర్యం పొందగోరే వారు రూ.800, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్, నామిని ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకొనిరావాలని కోరారు.

ప్రజల మధ్య ఉండే వారిని గెలిపించండి

▸ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

రఘునాథపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో, ప్రజల మధ్య ఉంటు గ్రామాభివృద్దే లక్ష్యంగా పనిచేసే వారిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల పరిధిలోని వి వెంకటాయపాలెం, వంగిడిలో సీపీఐ బలపర్చిన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జానిమియా, పగడాల మల్లేష్, వెంపటి కృష్ణమోహన్, రావేళ్ళ శ్రీనివాస్, రావేళ్ళ సురేష్, రాపర్తి రాజా, మండలి గురవయ్య, గరిడి రాంబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతత దిశగా పార్కుల నిర్మాణం

▸ మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పనిఒత్తిడిలో ఉన్న పట్టణ ప్రజలకు ప్రశాంతత కోసం ఖమ్మం నగరంలో నూతన పార్కులు నిర్మాణంతో పాటుగా గతంలోని పార్కులను అభివృద్ధి జరుగుతుందని కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. సోమవారం 54వ డివిజన్‌లో నిర్మాణం జరుగుతున్న పార్కును కమిషనర్ పరిశీలించారు. అందమైన మొక్కలు పెంపకం, వాకింగ్ ట్రాక్‌లు, ఇతర సౌకర్యాలను తనిఖీలు చేశారు. స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నాయకులతో ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక పాల్గొన్నారు.

మెజారిటీ స్థానాల్లో విజయం సాధించాలి



హైదరసాయిపేట సర్పంచ్ సీమ్లాను అభినందిస్తున్న దయాకరరెడ్డి

తిరుమలాయపాలెం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో మండలంలో మెజారిటీ స్థానాల్లో అభ్యర్థులను గెలిపించాలని మంత్రి పొంగులేటి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించి పార్టీకి ఓటేసేలా చైతన్యం నింపాలన్నారు. ఈసందర్భంగా హైదరసాయపేటలో ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికైన సీమ్లానాయక్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి, గుర్రరాల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, దాసరి నాగయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో 'హార్వెస్ట్'విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని హార్వెస్ట్ పాఠశాల యజమాన్యం తెలిపింది. పోటీలలో సుమారు 25 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. 6 స్వర్ణ, 10 రజత, 4 కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీలలో విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి అభినందించారు.

చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్ఐ

తిరుమలాయపాలెం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరు పనిచేయాలని, చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలను బైండవర్ కేసు నమోదు చేసి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 40గ్రామపంచాయతీలలో 950మందిపై బైండోవర్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ జగదీష్

పంచాయతీ.. పరీక్ష!

(5వ పేజీ తరువాయి)

నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, ఇల్లెందు నియోజకవర్గంలోని కామేపల్లి, మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మండలాల్లో 22 పంచాయతీలు ఏకగ్రీవం కాగా 17 కాంగ్రెస్ సీపీఐ3, బీఆర్ఎస్ 1, మాస్‌లైన్ 1 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నుంచి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకరరెడ్డితో పాటు పాలేరు నియోజకవర్గ నాయకులు, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల తరపున ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితరులు పాల్గొంటున్నారు. వామపక్షాల నుంచి కూడా జిల్లా నేతలు పాల్గొంటున్నారు

నేడు మూడో విడత జాబితా

ఇక ఈనెల 17న జరిగే మూడోవిడత ఎన్నికకు సంబంధించి ఏడు మండలాల్లోని 192 గ్రామపంచాయతీలు, 1,740వార్డులకు మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తికానుండగా.. అనంతరం తుది జాబితా వెల్లడి కానుంది. దీంతో ఏకగ్రీవాలు అధికారికంగా వెల్లడి కానున్నాయి. ఆతర్వాత ఈ మండలాల్లో కూడా ప్రచారం ఊపందుకోనుంది. మూడో విడత పోరు రసవత్తరంగా మారబోతుంది. సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు, సత్తుపల్లి, కల్లూరు,పెనుబల్లి, తల్లాడ, మండలాలతో పాటు వైరా నియోజకవర్గంలోని ఏన్కూరు, కారేపల్లి మండలాలు మూడో విడత జాబితాలో ఉన్నాయి. మూడో విడతలో 11చోట్ల ఒక్క నామినేషన్ పడగా 9 కాంగ్రెస్, 1 మాస్‌లైన్, 1స్వతంత్రులకు ఏకగ్రీవమయ్యాయి. వీటిపై అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అయితే నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఏకగ్రీవాల సంఖ్య పెరగనుంది. సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్‌నాయక్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోగా బీఆర్ఎస్‌కూడా సత్తుపల్లి నియోజకవర్గంలో గట్టి ప్రచారం సాగిస్తుంది. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రతీ పంచాయతీలో అభ్యర్థులను బరిలో దించి కాంగ్రెస్‌ను ఢీకొంటున్నారు. ఇక్కడ కాంగ్రెస్‌కు రెబల్స్ బెడదంతో కొంత లాభపడవచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది.



ముగిసిన జూబ్లీక్లబ్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని జూబ్లీక్లబ్ ఎన్నికలకు సంబంధించి కీలక నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగిసింది. ఈ మేరకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను క్లబ్ ఎన్నికల అధికారులు ఎం. శ్రీనివాసరావు, వై. రమేష్ ప్రకటించారు. సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పదవికి మోత్కూరి నాగేశ్వరరావు, కటకం ఉమామహేశ్వరరావు ప్యానల్, మరో ప్యానల్ నుంచి జొన్నలగడ్డ రవికుమార్, గంగిశెట్టి వెంకటేశంలు పోటీలో ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈసీ మెంబర్ల పదవులకు వల్లభనేని చందు, నన్నక మాధవరావు, వేములూరి నాగరాజదేవర, లింగం నరేందర్, పోట్ల ప్రభాకర్, యలమద్ది ప్రవీణ్, ఏపూరి రామారావు, మాటేటి రవి, జాలాది రవికిరణ్, పోటు రోహిత్, బీరెడ్డి సత్యవర్ధన్‌రెడ్డి, నల్లమోతు శేషయ్య, వేములపల్లి శ్రీకాంత్, దుబాకుల శ్రీనివాసులు, ఎం ఎస్‌కే. సుభాని పోటీలో ఉన్నారని తెలిపారు.

విస్తరణలో మార్పులు చేయాలని వినతి

ఖమ్మం కార్పొరేషన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి నూతనంగా ఏర్పాటు చేస్తున్న మాస్టర్ ప్లాన్‌తో తమ నివాసాలకు తీవ్ర ఇబ్బందులు రాబోతున్నాయని 6వ డివిజన్‌లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించిన ప్రజావాణిలో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. నగరంలోని ఖానాపురం ప్రాంతంలో విస్తరించి ఉన్న పరిశ్రమల ప్రాంతాన్ని మల్లేమడుగు రెవెన్యూ ప్రాంతంలోని సర్వే నెంబర్ 285, 286, 311, 312 నూతన ప్రపోజల్ మాసర్ ప్లాన్‌తో విస్తరణ జరగటంతో తమ నివాసాలు పరిశ్రమల ప్రాంతం పరిధిలోకి మార్పులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 100కు పైగా నివాసాలు ప్రపోజల్ మాస్టర్ ప్లాన్‌లోకి మార్పులు జరిగిందని తిరిగి నివాస ప్రాంతంలోకి నూతన మాస్టర్ ప్లాన్‌లో మార్చాలని కోరారు. దీంతో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేర్పులు చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారిని ఆదేశించారు.



సమస్యను వివరిస్తున్న స్థానికులు

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

నేలకొండపల్లి/కూసుమంచి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించి తీరాలని రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి సూచించారు. సోమవారం ఆయా మండలాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల కమీషన్ నిబంధనలను అతిక్రమించ కూడదన్నారు. ఇప్పటికే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులకు బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఓటుహక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకునే వాతావరణాన్ని పోలీస్‌శాఖ కల్పిస్తున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, కూసుమంచి సీఐ టి.సంజీవ్, ఎంపీడీవో జశ్వంత్‌కుమార్, ఎస్ఐలు పి.సంతోష్, నాగరాజు దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి

ఈవీఎంల గోదాం తనిఖీ

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మూడునెలల తనిఖీలో భాగంగా కలెక్టరేట్ అవరణంలోని ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఈవీఎం గోదాము సీల్‌ను పరిశీలించారు. రాజకీయ ప్రతినిదులు, అధికారుల సమక్షంలో సీల్‌ను తొలగించి ఈవీఎం, వీవీప్యాట్లను పరిశీలించారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాము లోపలి గోడలపై క్రాక్‌లను పరిశీలించి వీటికి చెమ్మరాకుండా తడి లేకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎంవీ రాజు, ఆర్‌అండ్‌బీ డీఈ లఖన్‌నాయక్, ఏఈ లలిత, ఎన్నికల డీటీ అన్సారీ, స్వర్ణసుబ్బారావు, కోడిరెక్కల ఉమాశంకర్, జి విద్యాసాగర్, ఆర్ ప్రకాష్, అన్నెం గోపాల్‌రావు, కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మధిర రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఖమ్మంపాడు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని పొందాలని సూచించారు. వరిపంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలో కలియ దున్నటం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో సాయిదీక్షిత్, ఏఈవో సుష్మా, రైతులు పాల్గొన్నారు.

తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే

రఘునాథపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దేనని, రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీ గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ కోరారు. సోమవారం రఘునాథపాలెం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారి విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ మండల అధ్యక్షుడు వీరూ నాయక్ తో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణ మట్లాడుతూ మండలంలోని గ్రామాలు మరింత అభివృద్ధి చెందేందుకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు.

నేడు వీధి వ్యాపారుల మార్కెట్ దుకాణాలకు డ్రా

ఖమ్మం కార్పొరేషన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల మార్కెట్‌లో కూరగాయల దుకాణాలు కేటాయింపునకు మంగళవారం లాటరీ ద్వారా దుకాణాలు కేటాయింపు జరుగుతుందని ఖమ్మం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11గంటలకు భక్తరామదాసు కళాక్షేత్రంలో డ్రా తీయటం జరుగుతుందని, ఇప్పటికే డిపాజిట్లు చెల్లించిన దుకాణదారులు లాటరీలో పాల్గొనాలని కోరారు.

నోటీస్‌పై లబ్ధిదారుల వినతి

రఘునాథపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో గల పువ్వాడ ఉదయనగర్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు ఓ మహిళ ఇది ప్రభుత్వ భూమి కాదని, ఇది ప్రైవేట్ భూమి గా అంటూ ఆ ఇళ్లను పొందిన లబ్ధిదారులకు ఆమె నోటీసులు పంపడంపై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం లబ్ధిదారులు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. కోయచలక సర్వే నెంబరు 192 (1)లో పలువురు మహిళలు ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా, కొందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, మిగిలిన కొందరు మహిళలకు రెండో విడతలో ఇల్లు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారని కలెక్టర్‌కు అందించిన వినతి పత్రంలో లబ్ధిదారులు పేర్కొన్నారు.

మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం పూర్తి సర్వే నిర్వహించి ఈ భూమి ప్రభుత్వానిదే అని నిర్ధారించుకున్న అనంతరమే ప్లాట్లు చేసి, తమకు ఇచ్చిన తర్వాతనే తాము ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకుని, జీవిస్తున్నట్లు వారు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేయించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి తుమ్మల కృషితో శాశ్వత నీటి పరిష్కారం

▸ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుమ్మల యుగంధర్

రఘునాథపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలంలో నీటి కొరతను అధిగమించేందుకు మంచుకొండలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో మండలానికి శాశ్వత నీటి పరిష్కారానికి మంత్రి తుమ్మల కృషి చేశారని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ అన్నారు. సోమవారం ఖమ్మం నియోజకవర్గంలోని మండల పరిధిలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రస్తావిస్తూ, రైతు బరోసా, రైతు బీమా, కల్యాణలక్ష్మి, శాదీ ముబారక్ ఆహార భద్రత కార్డులు, రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణి వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని అన్నారు. అభ్యర్థులు ప్రజల మద్దతు పొందడానికి ఈ పథకాలను ఇంటింటికీ చేర్చి, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలంటూ సూచించారు. ప్రజలు తమ ఓటుతో అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని, సత్యనిష్ఠతో పనిచేసే నాయకులను గెలిపించాలని పిలుపునిచ్చారు. తుమ్మల కుటుంబం ఖమ్మం ప్రజల అభివృద్ధి కోసం మూడు తరాలుగా అంకితభావంతో సేవలందిస్తోందని, ప్రజల ఆశీర్వాదాలతో ఈ సేవా యజ్ఞం మరింత బలంగా కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మానుకొండ రాధా కిషోర్, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, మాస్తాఫా. మలీదు వెంకటేశ్వర్లు కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కాలినడకన ప్రచారం నిర్వహిస్తున్న యుగంధర్

ఉప సర్పంచ్‌ల ఎన్నిక

కామేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీలలో 6గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయిన విషయం విధితమే. అందులో భాగంగా సోమవారం రిటర్నింగ్ అధికారులు సర్పంచ్‌కు, వార్డు సభ్యులకు ఎన్నిక పత్రాలను అందజేశారు. అంతేకాకుండా ఉప సర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహించారు. లాల్యతండలో ఉప సర్పంచ్‌గా గుగులోత్ హత్తిరాం, జగన్నాథతండ ఉప సర్పంచ్‌గా కోలెం నాగమణి, కెప్టెన్ బంజర ఉప సర్పంచ్‌గా కుంజ పవన్, జోగ్గూడెం ఉప సర్పంచ్‌గా జర్పల అనిత, ఊట్కూర్ ఉప సర్పంచ్‌గా కర్నాటీ రాజేంద్రప్రసాద్, పాతలింగాల ఉప సర్పంచ్‌గా గరిక గోపిని వార్డు సభ్యులు చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నుకున్నారు. వారితో పాటు సర్పంచులు బానోత్ దీనూ, మాలోత్ సౌజన్య, భూక్య సైదమ్మ, కిన్నెర సుజాత, అరెం అచ్చమ్మ, ఈసం హన్మంతరావు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నిక పత్రాలను అందజేస్తున్న అధికారులు

ఆదర్శ పంచాయతీగా మారుస్తా

▸ కాటపాడు కాంగ్రెస్ అభ్యర్థి కొంటెముక్కల నాగేశ్వరరావు



ప్రచారం నిర్వహిస్తున్న నాగేశ్వరరావు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలు తెలిసిన వ్యక్తిగా, ప్రజల కష్టాలను చూసిన వ్యక్తిగా మీ సమస్యలను తీర్చాలనే లక్ష్యంతో ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్నాను. మీ అందరి ప్రేమ, ఆప్యాయలతో నన్ను గెలిపించాలని కోరుతున్నా. రఘునాథపాలెం మండలం కోటపాడు పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కొంటెముక్కల నాగేశ్వరరావు ప్రచారంలో దూసుకుపోతూ విజయం దిశగా ప్రచారం నిర్వహిస్తున్నాడు. స్థానికుడై ఉండి, స్థానిక సమస్యలపై పట్టు ఉన్న వ్యక్తిగా అందిరికి సుపరిచితుడిగా ఉండటంతో ఆయన గెలుపు పక్కా అని స్థానికులు తెలుపుతున్నారు. కోటపాడు పంచాయతీని మండలంలోనే మోడల్ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేకు ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నా రు నాగేశ్వరరావు. మంత్రి తుమ్మల, రాష్ట్ర నాయకుడు యుగంధర్, గ్రామ నాయకుల సహకారాలతో గ్రామంలోని సమస్యలను తీర్చి అత్యుత్తమ పంచాయతీగా చేస్తానని హామీ ఇస్తున్నారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యమిస్తాం: జీఎం

సత్తుపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పని ప్రదేశంలో సురక్షితమైన వాతావరణాన్ని సృష్టిస్తూ కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని సత్తుపల్లి ఏరియా జీఎం సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక జేవీఆర్ ఓసీలో 56వ రక్షణ వార్షిక పక్షోత్సవాల సందర్భంగా కార్మికుల కోసం నూతనంగా నిర్మించిన రెస్ట్ షెల్టర్స్, నూతన బస్ సర్వీస్‌ను ప్రారంభించారు. అనంతరం అన్ని విభాగాలలో ప్రత్యేక రక్షణ తనిఖీ బృందాలు పరిశీలించి భద్రతా సూత్రాలపై అవగాహన కల్పించారు. రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, రక్షణ ఏర్పాట్లు, ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల సంఖ్య, ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలు పరిశీలించారు. ప్రమాదాలను తగ్గించి రక్షణను పెంచే లక్ష్యంతో ఈ రెండు వారాల పాటు గనులలో, ఓసీపీలలో ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుండగా అధికారులు, కార్మికులు, సిబ్బంది సహకరించాలని కోరారు. కాగా స్కోరింగ్ ఆధారంగా ఎంపికైన విజేతలకు సెంట్రల్ ఫంక్షన్ నిర్వహించి విజేతలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారుల చేతులమీదుగా బహుమతులు అందించనున్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఆర్.ప్రహ్లాద్, కే.సాయిబాబు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

సీపీఎం గెలుపుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

» జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

బోనకల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సర్పంచ్ అభ్యర్థుల విజయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. గ్రామ సీపీఎం సర్పంచ్ అభ్యర్థి మందా కరుణ విజయాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల జీవనం స్వేచ్ఛగా సాగాలంటే తమ పార్టీ అభ్యర్థులను ఆదరించాలని కోరారు.

కార్మికుల భద్రతే ప్రధానం: జీఎం

» జేవీఆర్ ఓసీలో 56వ రక్షణ వార్షిక పక్షోత్సవాలు



జేవీఆర్ ఓసీలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

సత్తుపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో సురక్షితమైన వాతావరణాన్ని సృష్టిస్తూ కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని సత్తుపల్లి ఏరియా జీఎం సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక జేవీఆర్ ఓసీలో 56వ రక్షణ వార్షిక పక్షోత్సవాల సందర్భంగా కార్మికుల కోసం నూతనంగా నిర్మించిన రెస్ట్ షెల్టర్స్, నూతన బస్ సర్వీస్‌ను ప్రారంభించారు. అనంతరం అన్ని విభాగాలలో ప్రత్యేక రక్షణ తనిఖీ బృందాలు పరిశీలించి భద్రతా సూత్రాలపై అవగాహన కల్పించారు. రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, రక్షణ ఏర్పాట్లు, ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల సంఖ్య, ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలు పరిశీలించారు. ప్రమాదాలను తగ్గించి రక్షణను పెంచే లక్ష్యంతో ఈ రెండు వారాల పాటు గనులలో, ఓసీపీలలో ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుండగా అధికారులు, కార్మికులు, సిబ్బంది సహకరించాలని కోరారు. కాగా స్కోరింగ్ ఆధారంగా ఎంపికైన విజేతలకు సెంట్రల్ ఫంక్షన్ నిర్వహించి విజేతలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారుల చేతులమీదుగా బహుమతులు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఆర్.ప్రహ్లాద్, కే.సాయిబాబు, సీహెచ్‌సీ.వెంకటరమణ, కృష్ణగోపాల్ తివారీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ అభ్యంతరాలపై సబ్ కలెక్టర్ విచారణ

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరు డివిజన్ పరిధిలో గల పలు గ్రామల్లో నామినేషన్ల తిరస్కరణపై వచ్చిన అభ్యంతరాలపై సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా తల్లాడ మండలంలోని నారాయణపురం 13 వార్డులో ఒక నామినేషన్‌ను తిరస్కరించారు, ఇక్కడ ఎన్నికల బరిలో నామినేషన్ వేసిన ఓ అభ్యర్థి కుల ధృవికరణ పత్రాన్ని తనకు బదులుగా కుతూరు ధృవికరణ పత్రం సమర్పించడంతో తిరస్కరించారు. వెంసూరు మండంలో కందుకూరు గ్రామ పంచాయితీలో నెం 14 వార్డులో బురుగు సురేష్ నామినేషన్ సరిగా లేనందున తిరస్కరించారు. పెనుబల్లి మండలంలో తుమ్మలపల్లి పంచాయితీలో సర్పంచు బరిలో నామినేషన్ వేసిన ఇద్దరు అభ్యర్థుల నామినేషన్ల విచారణ జరిపి వాటిని అనుమతించారు. నియామవళిని పాటిస్తూ పై నామినేషన్లపై పరిశీలన జరిపిన సబ్‌కలెక్టర్ తగిన ఆదేశాలు జారి చేశారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డీఏవో



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య

మధిర రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఖమ్మంపాడు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. వరిపంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలో కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో సాయిదీక్షిత్, ఏఈవో సుష్మా, రైతులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు సండ్ర పరామర్శ



వరలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం పలు కుటుంబాలను పరామర్శించారు. పడమట లోకవరం గ్రామ మాజీ సర్పంచు కళ్యాణపు కొండలరావు మాతృమూర్తి వరలక్ష్మి దశ దిన కార్యక్రమం సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి. వరలక్ష్మి కుమారులైన మోహన్‌రావు, రామారావు, కోటేశ్వరరావు, అప్పారావు, కొండలరావులకు సానుభూతి సంతాపం తెలిపారు. అదే విధంగా కల్లూరులో ప్రముఖ రాజకీయ నాయకుడు వలసాల వెంకట్రామయ్య అనారోగ్యంతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందగా, సమాచారం తెలుసుకున్న సండ్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించి సానుభూతి సంతాపం తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, బోబోలు లక్ష్మణరావు, పెద్దబోయిన మల్లేశ్వరావు, పెడకంటి రామకృష్ణ, ఎస్‌కె కమ్లి, సిహెచ్ కిరణ్ ఉన్నారు.

విత్తన రైతులకు అగ్రిమెంట్ పత్రాల పంపిణీ



అగ్రిమెంట్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఏవో మంజూఖాన్

వైరా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని గండగలపాడు గ్రామంలో సాగుచేయనున్న రైతులకు సింజంట, పైనీర్ కంపెనీల ఏజెంట్లు అగ్రిమెంట్ బాండ్ పత్రాలను మండల వ్యవసాయ శాఖ అధికారి మయాన్ మంజూఖాన్ చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన మొక్కజొన్న సాగు చేయు రైతులకు కంపెనీల ద్వారా అగ్రిమెంట్ పత్రాలను అందించటం జరిగిందన్నారు. విత్తన మొక్కజొన్న పంట వల్ల నష్టం వాటిల్లినట్లయితే కంపెనీలు రైతులకు నష్టపరిహారం అందించే విధంగా రైతులకు అందజేయటం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో మేడా రాజేష్, సింజంట, పైనీర్ కంపెనీల ఏజెంట్లు, రైతులు పాల్గొన్నారు.

తాగి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

» నేటి సాయంత్రం నుంచి 144సెక్షన్ అమలు

» వైరా ఎస్ఐ రామారావు



బ్రీత్ ఎనలైజర్ టెస్టులు చేస్తున్న ఎస్ఐ రామారావు

వైరా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి గొడవలు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వైరా ఎస్ఐ పుష్పాల రామారావు హెచ్చరించారు. సోమవారం వైరాలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి బ్రీత్ ఎనలైజర్ టెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం సేవించి ఇతరులకు ఇబ్బంది కల్గించడం కానీ, గొడవలు పెట్టడం గానీ చేయవద్దని సూచించారు. మంగళవారం సాయంత్రం ఐదుగంటల నుంచి ఈనెల 11వతేదీ సాయంత్రం వరకు వైరా మండలంలో 144సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందని ఎక్కడైనా మద్యం తాగి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వైరా పట్టణ రెండో ఎస్ఐ వెంపట పవన్ పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎంపికలో ఎమ్మెల్యే నిర్ణయమే ఫైనల్

» డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణ



సత్తుపల్లిలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ

సత్తుపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థుల ఎంపికలో స్థానిక ఎమ్మెల్యే నిర్ణయమే ఫైనల్ అని డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 17న జరుగనున్న సర్పంచ్ ఎన్నికలలో గ్రామ, మండల అధ్యక్షుడి అభిప్రాయాల మేరకు ఫైనల్ అయిన వారే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా అధిష్ఠానం పరిగణిస్తుందన్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ ముందుకెళ్తుందన్నారు. దీనికి భిన్నంగా ఉనికి కోల్పోతున్న ప్రతిపక్షాలు, వెనుక ఉండి నడిపిస్తే, వ్యవహరించే వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, అలాంటి వారిపై కూడా క్రమశిక్షణా చర్యలు ఉంటాయన్నారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, సొసైటీ, దేవాలయం, నీటిసంఘాల వంటి పదవులను అర్హులైన వారికి కాంగ్రెస్ పార్టీ కేటాయిస్తుందని, నామినేషన్ వేసిన రెబల్స్ నేడు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధిని కోరుకునే ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పదవులు వస్తాయని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేద ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. కిందిస్థాయి నుంచి సమర్థవంతంగా ప్రజలకు అందుబాటులో ఉండే వారినే గుర్తించి అభ్యర్థులుగా ఎంపిక చేశామని, వారిని గెలిపించుకుంటే పథకాలు అన్నీ సక్రమంగా అందుతాయన్నారు. ఆశావహులు నిరాశకు లోనవ్వద్దని, రెబల్స్ లాగా చేస్తే పార్టీకి తీవ్రనష్టం ఉంటుందని, ఈ క్రమంలో ఉపసంహరించుకోవాలని కోరారు. పార్టీకోసం కష్టపడే వారి రాబోయే రోజులల్లో పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులకు తిరుగులేదు

» పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కూనంనేని



కొణిజర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎనినకల్లో సీపీఐకి ప్రజాదరణ చూస్తుంటే ఇప్పుడే అర్థమవుతోందని, కమ్యూనిస్టులకు తిరుగులేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంభశివరావు స్పష్టం చేశారు. ఆయా పార్టీలు బలపరిచిన సీపీఐ సర్పంచ్ అభ్యర్థుల విజయం కోరుతూ మండలంలోని కొండవనమాల, పెద్దమునగాల, చిన్నగోపతి, తనికెళ్ల గ్రామాలలో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని తనికెళ్లలో మాట్లాడారు. మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, సీపీఐ జాతీయసమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండు సురేష్, జిల్లా నాయకులు యర్రాబాబు, దొండపాటి రమేష్, మండల నాయకులు పీవీరావు, ఆయా పార్టీల నాయకులు చల్లా మోహన్‌రావు, గడల నరేందర్, కవిడ మురళీకృష్ణ, తుప్పతి మల్లిఖార్జున్‌రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, చల్లా నారాయణ, యాసా వెంకటేశ్వరరావు, స్థానికులు ఆకుతోట ఆదినారాయణ పాల్గొన్నారు.

బోనకల్: అవకాశవాద రాజకీయాలతో ఓట్లు అడిగే వారికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పేదలకు అభివృద్ధి ఫలాలను అందించడానికి తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలల్లో ప్రజలు అభివృద్ధికి పాటుపడే వారిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, గాంధీ, బందం నాగేశ్వరరావు, రామారావు, అనిల్, పాల్గొన్నారు.

మధిర రూరల్: గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారమే సీపీఐ ధ్యేయమని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం ఖమ్మంజిల్లా మధిర మండలం మల్లారం గ్రామంలో జరిగిన సీపీఐ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పేద ప్రజల సమస్యల పట్ల సీపీఐ పార్టీ ఎప్పుడూ స్పందిస్తుందన్నారు. రైతులు, పేదలు, కూలీలకు నిత్యం అండగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునేది తమ పార్టీ మాత్రమేనన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం పాటుపడతామన్నారు. సీపీఐ జాతీయ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఐ నాయకులు మందడపు రాణి, రవిబాబు, పూట్ల కొండలరావు పాల్గొన్నారు.

గెలిపించండి.. ఆడబిడ్డలకు అండగా ఉంటా: శైలజ

» రాజకీయాలకు తావు లేకుండా పథకాలను వర్తింపజేస్తా

» బీఆర్ఎస్ బలపరిచిన సీపీఎం సర్పంచ్ అభ్యర్థి శైలజ

బోనకల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తనను సర్పంచ్‌గా గెలిపిస్తే ఐదు సంవత్సరాల పదవీకాలంలో గ్రామంలో కొత్తగా పెళ్లిల్లు చేసుకునే ఆడ బిడ్డలకు తన స్వంత ఖర్చుతో పసుపు, కుంకుమ కింద రూ. 5వేల నగదు, చీర, జాకెట్‌ను అందజేస్తానని బీఆర్ఎస్ బలపరిచిన సీపీఎం సర్పంచ్ అభ్యర్థి నిమ్మతోట శైలజ గ్రామ ప్రజలకు వినూత్న హామి ఇచ్చారు. మండలంలోని చిరునోముల గ్రామంలో సోమవారం నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆమె ప్రతి గడపకు వెళ్లి తాను చేయబోయే పనులను వివరించారు. అధికార దర్పం లేకుండా సేవకురాలిగా పని చేస్తానని, రాజకీయాలకు తావు లేకుండా ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికి చేర వేస్తానన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుద్య పనుల నిర్వహణతోపాటు పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామి ఇచ్చారు. సొంత ఎజెండాతో కాకుండా ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. కూటమి నాయకులు చావా వెంకటేశ్వరరావు, రావెళ్ల లక్ష్మయ్య, గరపాకుల లక్ష్మయ్య, నిమ్మతోట ఖానా, నీలకంఠ రాము, రమేష్, దేవేందర్, కిరణ్ పాల్గొన్నారు.



చిరునోములలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి శైలజ

సీనియర్ నాయకుడు వెంకట్రామయ్య కన్నుమూత



నివాళులర్పిస్తున్న నాయకులు

కల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ప్రముఖ రాజకీయ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు వలసాల వెంకట్రామయ్య (80) అనారోగ్యంతో సోమవారం తెల్లవారు జామున నివాసా గృహంలో మృతి చెందారు. వెంకట్రామయ్య 1969వ సంత్సరంలో ప్రజా సమితి పార్టీలో రాజకీయ రంగ ప్రవేశం చేసి నాటి నుంచి మూడు సంత్సరాల క్రితం వరకు రాజకీయాల్లోనే ఉన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ చేకూరి కాశయ్య ముఖ్య అనుచరుడిగా మంచి గుర్తింపు పొందారు. ఆ తరువాత తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక రాజకీయాల్లో పనిచేశారు. అనంతరం కల్లూరు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడిగా, కల్లూరు మేజర్ గ్రామ పంచాయితీ వార్డు సభ్యుడిగా రెండు సార్లు పని చేశారు. అఖిల పక్ష రాజకీయ నాయకులందరితో వెంకట్రామయ్య మంచి సంబంధాలు పెంచుకుని ఈ ప్రాంతంలో రాజకీయంగా మంచి గుర్తింపు పొందారు. వెంకట్రామయ్యకు భార్యతో పాటుగా ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న టిడిపి రాష్ట్ర నాయకులు కేతినేని హరీష్, కాకర్ల రంగారావు, జిల్లా నాయకులు చింతనిప్పు నాగేశ్వరరావు, బోయిన వెంకన్న, ఆర్ ప్రసాద్, రాష్ట్ర హౌసింగ్ ఉద్యోగుల సంఘం నాయకుడు బోగ్గుల వెంట్రామిరెడ్డి, ఏబిసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనోష్‌కుమార్, పలు పార్టీల నాయకులు జాస్తి శ్రీనివాసరావు, చిట్టిబాబులు వెంకట్రామయ్య మృతదేహంపై పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం తెలిపారు.

పంచాయతీ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు

వైరా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో సోమవారం తాటిపూడి, గొల్లపూడి గ్రామాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాటిపూడిలో బీఆర్ఎస్, సీపీఎం, టీడీపీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బట్టా పెద్ద భద్రయ్యను గెలిపించాలని కోరారు. అలాగే గొల్లపూడిలో బీఆర్ఎస్, టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాణాల వెంకటేశ్వర్లును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అష్ణగుర్తి గ్రామంలో ఉమ్మడి సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కంచర్ల అనితను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని వారు విమర్శించారు. మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, నాయకులు వనమా విశ్వేశ్వరరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మద్దెల రవి, మాదినేని ప్రసాద్, వజినేపల్లి చక్రవర్తి, నూకల వాసు, మిట్టపల్లి సత్యంబాబు, ఏదునూరి శ్రీను,

గుండెపోటుతో మాజీ కార్యదర్శి హఠాన్మరణం

తల్లాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన ఆయిల్ సీడ్స్ సొసైటీ మాజీ కార్యదర్శి అన్నెం వెంకటేశ్వర రెడ్డి(55) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. వెంకటేశ్వరరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్దకుమార్తె కావ్య అమెరికాలో, చిన్నకుమార్తె స్నేహ ఆస్ట్రేలియలో ఉంటున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ముఖ్య అనుచరుల్లో ఒకరైన వెంకటేశ్వరరెడ్డి టీడీపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో క్రియాశీలకంగా పనిచేశాడు.

యాజమాన్యంతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తాం

» ఆర్టీసీ డిపో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డిపోలోని ఉద్యోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికై యాజమాన్యంతో చర్చిస్తామని సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పప్పుల రాఘవులు, కల్లేపల్లి సర్వేశ్వరరావులు అన్నారు. సోమవారం సత్తుపల్లిలో నూతన కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నాగయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా మంచినీళ్ల ముత్తయ్య, సహాయ కార్యదర్శిగా వేల్పుల వెంకట రమణ, ఉపాధ్యక్షుడిగా నార్లపాటి రాంబాబు, ప్రచార కార్యదర్శిగా కిన్నెర ఆనందరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మాలోతు వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారుగా జొన్నలగడ్డ వెంకటయ్య, జిల్లా కమిటీ మెంబర్‌గా జొన్నలగడ్డ జగన్నాథం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆర్టీ.రావు, కేఎన్.రావు, కోట నల్లయ్య, పానెం ఇజ్రాయిల్, బాలరావు, అనిల్, సత్తిబాబు, వీవీ.రమణ, రాంబాబు, గొల్లమందల రవికుమార్, రత్నాకర్, హుస్సేన్, ముత్తయ్య, రత్నరాజు, టీ.వెంకటకృష్ణ, సూరిబాబులు పాల్గొన్నారు.

ప్రజా సేవకై వస్తున్నా.. ఆదరించండి

» కొణిజర్ల సర్పంచ్ అభ్యర్థిని గూదె పుష్పావతి

» సూరంపల్లి రామారావుతో కలిసి ప్రచారం

కొణిజర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యావంతురాలుగా ప్రజలకు సేవ చేయాలనే తపనతో కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు ఆశీస్సులతో అతనిని స్ఫూర్తిగా తీసుకుని ఎన్నికల బరిలో నిలిచానని గ్రామస్థులంతా తనను ఆశీర్వదించాలని, సర్పంచ్‌గా గెలిచి నిత్యం ప్రజాసేవ చేస్తానని కొణిజర్ల సర్పంచ్ అభ్యర్థిని గూదె పుష్పావతి కోరారు. సోమవారం కొణిజర్లలో తన అభ్యర్థిత్వాన్ని గెలిపించాలని కోరుతూ గ్రామంలో ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటరును కలుసుకుని ఓటు వేయాలని కోరారు. ప్రజల సమస్యను తన సమస్యగా భావిస్తానని, నిత్యం గ్రామాభివృద్ధి కోసమే పని చేస్తానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సూరంపల్లి రామారావు వంటి మేధావులను స్ఫూర్తిగా తీసుకుని గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. 'ఓటు వేసే బాధ్యత మీదని, ఆ తర్వాత అభివృద్ధి బాధ్యత నాదని ఆమె ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు గ్రామ మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, ఆమెకు మద్దతు తెలిపిన రాజకీయ పార్టీల నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న గూదె పుష్పావతి, సూరంపల్లి రామారావు

కల్యాణపు బెంచీ వితరణ



రూ.లక్ష విలువైన బెంచీని బహూకరిస్తున్న పృథ్వీకృష్ణా దంపతులు

మధిర రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధిరలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో రూ.లక్ష విలువైన కల్యాణపు బెంచీని సమర్పించారు. స్వామి వారి అభిషేకం, కల్యాణం నిమిత్తం రూ.లక్ష విలువైన కల్యాణపు బెంచీని మేళ్లచెరువు పృథ్వీకృష్ణా, దేవి ప్రియాంక, కుమారుడు వెంకటేశ్వరరావు, కోడలు రాధ సోమవారం దేవాలయానికి అందజేశారు.

పంచాయతీ.. పరీక్ష!

(5వ పేజీ తరువాయి)

నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, ఇల్లెందు నియోజకవర్గంలోని కామేపల్లి, మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మండలాల్లో 22 పంచాయతీలు ఏకగ్రీవం కాగా 17 కాంగ్రెస్ సీపీఐ3, బీఆర్ఎస్ 1, మాస్‌లైన్ 1 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నుంచి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకరరెడ్డితో పాటు పాలేరు నియోజకవర్గ నాయకులు, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల తరఫున ఎమ్మెల్సీ తాతా మధుసూధన్ పాల్గొంటున్నారు. వామపక్షాల నుంచి కూడా జిల్లా నేతలు పాల్గొంటున్నారు

నేడు మూడో విడత జాబితా

ఇక ఈనెల 17న జరిగే మూడోవిడత ఎన్నికకు సంబంధించి ఏడు మండలాల్లోని 192 గ్రామపంచాయతీలు, 1,740వార్డులకు మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తికానుండగా.. అనంతరం తుది జాబితా వెల్లడి కానుంది. దీంతో ఏకగ్రీవాలు అధికారికంగా వెల్లడి కానున్నాయి. ఆతర్వాత ఈ మండలాల్లో కూడా ప్రచారం ఊపందుకోనుంది. మూడో విడత పోరు రసవత్తరంగా మారబోతుంది. సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు, సత్తుపల్లి, కల్లూరు,పెనుబల్లి, తల్లాడ, మండలాలతో పాటు వైరా నియోజకవర్గంలోని ఏన్కూరు, కారేపల్లి మండలాలు మూడో విడత జాబితాలో ఉన్నాయి. మూడో విడతలో 11చోట్ల ఒక్క నామినేషన్ పడగా 9 కాంగ్రెస్, 1 మాస్‌లైన్, 1స్వతంత్రులకు ఏకగ్రీవమయ్యాయి. వీటిపై అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అయితే నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఏకగ్రీవాల సంఖ్య పెరగనుంది. సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్‌నాయక్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోగా బీఆర్ఎస్‌కూడా సత్తుపల్లి నియోజకవర్గంలో గట్టి ప్రచారం సాగిస్తుంది. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రతీ పంచాయతీలో అభ్యర్థులను బరిలో దించి కాంగ్రెస్‌ను ఢీకొంటున్నారు. ఇక్కడ కాంగ్రెస్‌కు రెబల్స్ బెడదతో కొంత లాభపడవచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది.

గ్యారంటీలను మరిచిన కాంగ్రెస్‌ను ఓడించాలి

బోనకల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా పంచాయతీ ఎన్నికలకు దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు కోరారు. మండలంలోని చిరునోముల గ్రామంలో సోమవారం జరిగిన కూటమి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకొని కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్ధానాలను ప్రజలకు సర్పంచ్ అభ్యర్థులు వివరించాలన్నారు. కూటమి నాయకులు చావా వెంకటేశ్వరరావు, రావేళ్ల లక్ష్మయ్య, గరపాకుల రామకృష్ణ, నిమ్మతోట ఖాన, నీలకంఠ రాము, నిమ్మతోట రమేష్, పిల్లెం దేవేందర్, గోపిరాజ్, బోడేపుడి కిరణ్, శీలం వీరభద్రం, అల్లిక రంగయ్య పాల్గొన్నారు.

వైరా వాసికి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు

వైరా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గాంధారిలో జాతీయస్థాయి తెలుగు ఆర్ట్ ఫొటోగ్రఫీ, వివిడ్ ఫొటోగ్రఫీ వారు నిర్వహించిన ఫొటో టూర్లో ఉత్తమ ఫొటో గ్రాఫర్‌గా వైరా మండలానికి తేళ్లపుట్ట చందు అవార్డు అందుకున్నాడు. తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ అనుబంధంతో ఈనెల ఆరేడు తేదీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గాంధారిలో జరిగిన జాతీయస్థాయి ఫొటో గ్రఫీ వర్క్‌షాపులో తేళ్లపుట్ట చందు అవార్డుతోపాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. మెంటార్స్‌గా భార్గవ్ హర్గే, సునీల్ వ్యవహరించారు. ఆర్గనైజర్ కుమారస్వామి, రామకృష్ణ అభినందించారు.